# 45

# రాజ్యములోని సంబంధములు

## (18:1-35)

ఈ సువార్తలో గల ఐదు ఉపదేశముల విభాగములలోని నాలుగవ విభాగం, మత్తయి 18వ అధ్యాయంలో కలదు మరియు ప్రతి విభాగము ప్రారంభములో "యేసు ఈ మాటలు చెప్పి చాలించిన తరువాత" అను మాటలు కలవు (7:28; 11:1; 13:53; 19:1; 26:1). యేసు యింకను కపెర్నహూములో ఉన్నప్పుడే, ఆయన యూదయ మరియు యెరూషలేమునకు వెళ్లుటకు కొద్ది కాలమునకు మునుపు బోధించిన ఉపదేశము, ఈ నాలుగవ విభాగంలో కలదు (19:1; 21:1).

ఈ సమయంలో, యేసు ఉపదేశము నూతన విశ్వాసుల సమాజము, అనగా సంఘము, అయన వ్యవస్థాపింపనై యుండిన సంఘములోని సంబంధములపై కేంద్రీకృతమై యుండినది (16:18). ఈ అధ్యాయము ఒక అంశము తరువాత మరొక అంశము బోధింపబడుచున్న ఐదు బాగములుగా నున్నది: (1) రాజ్యములో గొప్పతనము (18:1–4), (2) అడ్డుబండలై యుండకూడదని జారీ చేయబడిన హెచ్చరికలు (18:5–9), (3) తప్పిపోయిన గొర్రె ఉపమానము (18:10–14), (4) సంఘర్షణలను సరిదిద్దుకొనుట (18:15–20), మరియు (5) క్షమింపలేకపోయిన దాసుని ఉపమానము (18:21–35).

### రాజ్యములో గొప్పతనము: వినయము[1] (18:1–4)

**[1]ఆ కాలమున శిష్యులు యేసు నొద్దకు వచ్చి, పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడని అడుగగా, [2]ఆయన యొక చిన్న బిడ్డను తనయొద్దకు పిలిచి, వారి మధ్యను నిలువబెట్టి యిట్లనెను [3]–మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. [4]కాగా ఈ బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొనువాడెవడో వాడే పరలోకరాజ్యములో గొప్పవాడు.**

**వచనము 1.** ఈ అధ్యాయమును మొదలుపెట్టుచున్న **ఆ కాలమున** అను పదజాలము, కపెర్నహూములో అంతకు మునుపు జరిగిన సంఘటనలతో నున్న ఒక సమీప సంబంధమును సూచించుచున్నది (17:24–27). ఈ చర్చ కపెర్నహూములో జరిగినదని మార్కు వ్రాసిన సువార్త నిశ్చయపర్చుచున్నది (మార్కు 9:33), వారు తరుచుగా చేయుచుండినట్లే, **శిష్యులు యేసునొద్దకు[2] ఒక ప్రశ్నతో వచ్చారు.**

మార్కు వ్రాసిన సువార్తలోని దీనికి సమాంతరమైన ఉదంతముతో మత్తయి సువార్తలోని వృత్తాంతమును పోల్చి చూచినట్లయితే ఇది సంక్షిప్తము గావింపబడినట్లు అగుపించుచున్నది. వారు యేసుతో కూడ "గలిలయ గుండా వెళ్లుచుండగా" (మార్కు 9:30) శిష్యులు "పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడను" విషయమును యేసుతో అనునిత్యము చర్చించుచుండిరి. ఇంతలో వారు కపెర్నహూము చేరుకొని, వారు బసచేయనైయుండిన గృహము, బహుశ

అది పేతురు ఇల్లై యుండును. లోనికి వెళ్లారు. అప్పుడు యేసు ప్రయాణములో వారు చర్చించుచుండిన విషయము (మార్కు 9:33) గూర్చిన వివరాలు తన శిష్యులనడిగి తెలిసికొన్నాడు. వారు చర్చించుచుండిన విషయమేమై యుండినదో నిస్సందేహంగా యేసు ఎరిగియుండెను, అట్లయినను ఆయన ఆ వివరము కొరకు వారినడిగాడు. వారు చర్చించుచుండిన విషయాల గూర్చి వారు బహు జాగ్రత్తగా ఆలోచించాలని కాబోలు యేసు వారినడిగాడు. ఇలా సంభాషణలు కొనసాగుచుండిన సందర్భములో, శిష్యులు, **పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడు?** అని ఆయననడిగారు.

స్పష్టంగా, శిష్యులు దేవుని రాజ్యమును గూర్చి యింకను ఒక తప్పుడు అవగాహన కలిగియుండిరి. ఈ చర్చ జరిగిన కొద్ది కాలము క్రితమే, యేసు తన శ్రమానుభవములను సవివరంగా రెండవ పర్యాయము వారికి ముందుగానే తెలియజెప్పాడు (17:22, 23). ఆయన తనను తాను శ్రమనొందు సేవకునిగా చిత్రీకరించుకొన్నాడు, అట్లయినను ఆయన శిష్యులు యింకను ప్రాపంచిక అధికార హోదాలు మరియు గొప్పతనమును గూర్చిన కోరికలే కలిగియుండిరి. "ఎవడైనను మొదటివాడై యుండగోరిన యెడల వారందరిలో కడపటివాడును అందరికి పరిచారకుడునై యుండవలెనని" యేసు తన శిష్యులతో చెప్పినట్లు మార్కు 9:35 సెలవిచ్చుచున్నది.

**వచనము 2.** యేసు తన శిష్యులడిగిన, ప్రశ్నలను, తరచుగా వారికి నూతన బోధలు పరిచయము చేయుటకు లభించిన సదవకాశములుగా సద్వినియోగము చేసికొన్నాడు (13:10, 36; 18:21; 24:3). ఈ సందర్భములో, ఆయన వారికి వివరించదలచిన సత్యమును సోదహరణముగా చిత్రీకరించు నిమిత్తము ఒక **చిన్న బిడ్డను** తన చేతుల్లోనికి తీసుకొన్నాడు. "చిన్న బిడ్డ" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*paidion*) చాలా చిన్న బిడ్డను, ఒక శిశువును సహితము సూచించును. ఈ సందర్భములో ఎత్తుకొన నుద్దేశించి యేసు ఆ బిడ్డను తన యొద్దకు **పిలిచాడు**, కాబట్టి ఈ బిడ్డ అప్పుడే నడక మొదలుపెట్టిన చంటిబిడ్డయై యుందును సంబంధిత తలిదండ్రుల సహాయమైనా ఉండినదో లేకుండినదో పేర్కొనబడలేదు. ఆ సమయానికి పేతురు కుటుంబికులందరు ఇంటిలో ఉండియున్నట్లయితే ఈ బిడ్డ వారిలో ఒకరై యుండునని కొందరు సూచించారు.

చిన్న బిడ్డ యేసు దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన ఆ **బిడ్డను శిష్యుల మధ్య** నిలువబెట్టాడు. అచ్చట కూడియుండిన పెద్దవారందరి మధ్య ఈ చిన్న బిడ్డ అంతగా పట్టించుకొనదగిన పాపయై యుండదు. ప్రాచీన ప్రపంచంలో పెద్దవారికియ్యబడినంత గొప్ప విలువ పిల్లలకు ఇవ్వబడలేదు. కుమార్తెల కంటె ప్రధానంగా కుమారులే కోరుకొనబడుచుండిరి ఏలయనగా ఈ కుమారులు పెరిగి పెద్దవారై, ఒక నాడు శ్రామికులుగాను యుద్ధంచేయగల సైనికులుగాను ఉపయోగపడుదురు. గ్రీకు-రోమా సమాజములో, ఆడవారు కొన్ని పర్యాయములు, అనారోగ్యస్థులైన మగవారితోపాటు, వదిలిపెట్టబడిరి. గర్భములోని ఆడ శిశువులు స్రావము గావింపబడిరి. పిల్లల గూర్చి యూదులు ఒక ఉన్నతమైన దృష్టికోణము కలిగియుండిరి, ఏలయనగా ఆశ్చర్యకరమైన దేవుని సృష్టిలో వీరిని ఒక భాగముగా ఎంచారు, అట్లయినను ఇటువంటి చిన్న పిల్లలు పెద్దల కంటె తక్కువైనవారిగా పరిగణించబడిరి (19:13, 14). ఈ నేపథ్యము గూర్చి ఆలోచించినట్లయితే యేసు చర్యలు నిజముగా ఎంత సమూల సమాజ సంస్కరణ సంబంధమైనవై యుండినవో బయల్పడుచున్నది. నైతిక

ప్రవర్తన నియమావళులను మరియు శౌర్యవంతమైన జీవిత విధానమును తమ శిష్యులు అనుకరించునట్లు వారికి వివరించుటకు ఉపదేశకులు ఆయా ఉదాహరణములను ఉపయోగించుట సామాన్యమైన సంగతై యుండినది. అయితే యేసు అక్షరాలా ఒక చిన్న బిడ్డనే వారి మధ్య నిలువబెట్టాడు.[3]

**వచనము 3.** పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడని వారడిగిన ప్రశ్నకు ఆయన ఇవ్వదలచిన సమాధానమునకు సరిపడు సాధనముగ యేసు ఈ చిన్న బిడ్డను సద్వినియోగము చేసికొన్నాడు. **మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని** ఆయన వివరించాడు. శిష్యులు రాజ్యధికార హోదాల కొరకు అయోమయంగా అరుస్తూ వాదించుకొనుచుండిరి, సరికదా ఆ రాజ్య న్యాయకత్వములో వారే అగ్రగణ్యులై యుందురను నమ్మకము కూడ కలిగియుండిరి. వారు అతిశయముతోను ఆత్మభిమానముతోను మొండిగా పట్టుబట్టినట్లయితే, వారి ఆతురత సంగతి ఎలా వున్నా అసలు ఆ రాజ్యములోనికి అడుగైనా పెట్టలేరని యేసు వారిని హెచ్చరించాడు. "ప్రవేశింపరు" అను మాట నొక్కివక్కాణింపబడుచున్న రెట్టింపైన వ్యతిరేకార్థక అనువాదమై *ou mē* యున్నది. దీనిని "నిశ్చయముగా ప్రవేశింపరు" లేక "ఎన్నటికినీ ప్రవేశింపరు" అని కూడ అనువాదింపవచ్చును (NIV; NRSV).

శిష్యులు "మార్పునొందవలసినవారై" (*strephō*) యుండిరి; వారు జీవితంలో ఒక "మలుపు"ను అనుభవింపవలసినవారై యుండిరి. పేతురు యొక్క రెండవ సుదీర్ఘమైన సదుపదేశమును నివేదించుచుండిన సందర్భములో (అపొస్తలుల కార్యాములు 3:20, 26), "తిరుగుడి" మరియు "మళ్లుడి" అని అనువదింపబడిన ఇటువంటి పదమునే *epistrepho*, లూకా ప్రయోగించుచున్నాడు. శిష్యులు కృత్రిమంగా ఉప్పొంగిపోయిన అహం నుండి బయటపడి, చిన్న పిల్లల వలె తగ్గింపుగలవారై యుండవలసి యున్నది. మారుమనస్సు నొందినవారందరు శిశుతుల్యమైన లక్షణములు అగత్యముగా కలిగియుండవలెను. పిల్లల్లో నిరపేక్షమైన విశ్వాసమున్నది, వారిలో అహంకారము లేదు, మరియు వారు ఇతరులను సులభముగా క్షమించుటకు ఉన్ముఖులై యున్నారు.[4] పరలోకములో ప్రవేశింపగోరు ప్రతి వాడు ఈ లక్షణములు కలిగియుండవలెను.

"పరలోక రాజ్యము" అను వ్యక్తీకరణము మత్తయి వ్రాసిన సువార్తలోనే 32 పర్యాయములు కనబడును, లేఖనములలో మరెచ్చటను కనిపించదు. ఈ పదజాలము మార్కు 9:1లో వ్రాయబడిన "దేవుని రాజ్యము" అను పదజాలమునకు పర్యాయపదమై యున్నది. వాగ్దానము చేయబడిన రాజ్యము ఇదే (దానియేలు 2:44). యేసు ఒలీవల కొండ మీద నుండి ఆరోహణుడై పరలోకమునకు వెళ్లక మునుపు "ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని అపొస్తలులు ఆయన అడిగారు (అపొస్తలుల కార్యములు 1:6). రాజ్యము యొక్క అసలైన లక్షణము గూర్చి వారు యింకా తికమకపడినవారుగానే యుండిరి. అందునుబట్టి యేసు వారికి ఇలా సెలవిచ్చాడు.

> "కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునపుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను, భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో

చెప్పెను" (అపొస్తలుల కార్యములు 1:7, 8).

ఈ ప్రవచనము పెంతెకొస్తు దినాన నెరవేరినది (అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయము). ఆ దినమున అపొస్తలులు పరిశుద్ధాత్మను మరియు శక్తి పొందారు, మరియు దేవుని రాజ్యము ఈ లోకములోనికి వచ్చినది (అపొస్తలుల కార్యములు 2:4, 32–36). ప్రజలు విశ్వాసము, మారుమనస్సు, మరియు బాప్తిస్మము ద్వారా రాజ్యములోనికి ప్రవేశించారు (అపొస్తలుల కార్యములు 2:37, 38). ఇది ఒకడు "దేవుని రాజ్యము లోనికి ప్రవేశింపగోరు ప్రతివాడు" "తిరిగి జన్మింపవలెను." అనగా, "నీటి మూలముగాను పరిశుద్ధాత్మ మూలముగాను జన్మింపవలెను" అని యేసు సెలవిచ్చిన ఆయన ఆదేశానుసారమైనదై యుండినది (యోహాను 3:3, 5).

**వచనము 4**. సంక్షిప్తముగా ఉపదేశింపబడిన ఈ పాఠము, మొదటి వచనములో నున్నట్లు తన శిష్యులడిగిన ప్రశ్నకు యేసు ఇచ్చిన సమాధానముతో ముగియుచున్నది: **ఈ చిన్న బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొనువాడెవడో, వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు.** దేవుని దృష్టిలో గొప్పవారమై యుండుటకు ఒకడు తనకు తాను తగ్గించుకొని ఇతరులకు పరిచారము చేయుటకు, ఇష్టపడుచున్నవాడై యుండవలెను. ఆయన సహితము "పరిచారము చేయించుకొనుటకు కాదు, కాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకును వచ్చెనని" యేసు తనను గూర్చి తెలియజెప్పాడు (20:28). ఇతరులకు పరిచారము చేయుట అనగా ఏమిటో పస్కా పండుగ సందర్భములో ఏర్పటుచేయబడిన భోజన సమయములో ఆయన తన అపొస్తలుల పాదములను కడుగుట ద్వారా వారికి ఒక మాదిరిని ప్రదర్శించాడు (యోహాను 13:5–16). జే. డబ్ల్యు. మెక్‌గార్వే గమనించిన వివరము ఇలా వున్నది, "అత్యంత అణకువగలవారు అత్యంత గొప్పవారై యుందురు ఏలయనగా వారు అత్యంత నిస్వార్థముగా జీవించుచు అత్యధికంగా యేసు మనస్సుగలవారై యుందురు."[5] "పైకి వెళ్లగోరువాడు, మొదట క్రిందికి, వాని మోకాళ్ల మీదకు, దిగవలసిదే" అని ఒకరు నుడివారు.

### అడ్డుబండలై యుండకూడదని యేసు చేసిన హెచ్చరిక: బాధ్యత (18:5–9)

**5మరియు ఈలాటి యొక బిడ్డను నా పేరట చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును.
6నాయందు విశ్వాసముంచు ఈ చిన్న వారిలో ఒకనిని అభ్యంతరపరచువాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలు. 7అభ్యంతరములవలన లోకమునకు శ్రమ; అభ్యంతరములు రాక తప్పవు గాని, యెవనివలన అభ్యంతరము వచ్చునో ఆ మనుష్యునికి శ్రమ. 8కాగా నీ చెయ్యియైనను నీ పాదమైనను నిన్ను అభ్యంతరపరచినయెడల, దానిని నరికి నీయొద్దనుండి పారవేయుము; రెండు చేతులును రెండు పాదములును కలిగి నిత్యాగ్నిలో పడవేయబడుట కంటె కుంటివాడవుగనో అంగహీనుడవుగనో జీవములో ప్రవేశించుట నీకు మేలు. 9నీ కన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల దాని పెరికి నీయొద్దనుండి పార వేయుము; రెండు కన్నులు గలిగి అగ్నిగల నరకములో పడవేయబడుటకంటె ఒక కన్ను గలిగి జీవములో**

**ప్రవేశించుట నీకు మేలు.**

అటుతరువాత యేసు తోటి విశ్వాసుల యెడల వ్యవహరింపవలసిన తీరు గూర్చి చెప్పాడు. విశ్వాసులు చేర్చుకొనబడవలెను (18:5) మరియు వారు అభ్యంతరపరచబడకూడదు (18:6). ఇతరులకు అభ్యంతరము కలుగజేయువారు బహు తీవ్రముగా తీర్పు తీర్చబడుదురు (18:7). ఇంకా, ఒకడు తానే అభ్యంతరపడకుండునట్లు తగు ముందు జాగ్రత్తలు తీసికొనుచుండవలెను (18:8, 9).

**వచనము 5. ఈలాటి యొక బిడ్డ,** యేసు తన హస్తములలోనికి తీసికొనిన బిడ్డను సూచించుచున్నది (మార్కు 9:36). ఒక విశ్వాసిని ఆహ్వానించు సూత్రమును సోదాహణంగా చిత్రీకరించుటకు ఆయన ఈ బిడ్డను ఉపయోగించుచుండెను. మామూలు మాటల్లో **చేర్చుకొనువాడు** అను పదము (*dechomai*) "ఒక వస్తువును లేక ఒకరిని తన యొద్దకు ఉద్దేశపూర్వకంగాను మనస్ఫూర్తిగాను అక్కున చేర్చుకొనుట" అని అర్థమిచ్చును. మత్తయి సువార్తలో అంతకు మునుపు, అపొస్తలుల ప్రేషిత సేవలకు మద్దత్తుగా వారికి ఇవ్వబడు ఆతిథ్యము గూర్చి చెప్పబడుచుండిన సందర్భములో ఇదే పదము యింకా ఎక్కువ నిర్దిష్టముగా ప్రయోగింపబడినది (10:40–42పై గల వాఖ్యానము చూడు). మార్కు సువార్తలోగల దీని సమానాంతర వాక్యభాగము ఇచ్చుచున్న అర్థము ఇచ్చట కూడ వర్తించును, ఏలయనగా "వారు క్రీస్తువారని క్రీస్తు పేరట త్రాగుటకు గిన్నెడు నీళ్లు" ఇతరులు అపొస్తలులకు ఇచ్చుట గూర్చి కూడ అచ్చట పేర్కొనబడి యున్నది (మార్కు 9:41). *Dechomai* మిషనెరీలకు ఇవ్వబడుచుండిన ఆతిథ్యమును సూచించుచున్నదని ఇతర వాక్యభాగముల ద్వారా కూడ తెలియుచున్నది (2 కొరింథీయులకు 7:15; గలతీయులకు 4:14; కొలొస్సయులకు 4:10; అపొస్తలుల కార్యములు 21:17 చూడు).

ప్రజలు దేవుని బిడ్డ యెడల సహా-సమాజములో నిమ్న తరగతులకు చెందినవారితో సహా-ప్రవర్తించు తీరు వారు యేసు యెడలనే ప్రవర్తించు తీరైయుండునని ఆయన స్పష్టముగా చెప్పుచుండెను (25:40, 45 చూడు). లోకము తరచుగా గొప్పవారి యెడలను ప్రజల్లో పలుకుబడిగల వారి యెడలను ఎలా ప్రవర్తించుచున్నదో తెలిసికొనుటకు ఒకరు అంతగా కష్టపడవలసిన అవసరం లేనేలేదు. వారు బలహీనులకును సమాజమెరుగనివారికిని పరిచారము చేయవలెనని యేసు తన శిష్యులకు ఆదేశములిచ్చాడు.[6]

**వచనము 6. విశ్వసించుచున్న ఈ చిన్న వారిలో ఒకనినైనను** అభ్యంతరపర్చకూడదని హెచ్చరించు విషయమును కూడ సోదాహరణంగా చిత్రీకరించుటకు యేసు చిన్న బిడ్డను ఉపయోగించుకొన్నాడు. మరొక పర్యాయము, ఈ ప్రస్తావన దేవుని ఆధ్యాత్మిక పిల్లలలో ఒకరిని గూర్చినదై యున్నది. **అభ్యంతరపరచు** అని అనువదింపబడిన క్రియా పదము (*skandalizō*) క్రొత్త నిబంధలోని యితరమైన ఏ పుస్తకము కంటెను మత్తయి వ్రాసిన సువార్తలో ఎక్కువ సార్లు అగుపించును.[7] ఈ అధ్యాయంలో, ఇతరులెవరైనా పాపము చేయునట్లు ఒకడు వారిని ప్రభావితము చేయుట ప్రస్తావింపబడుచున్న సందర్భములో, ఈ పదము 6వ, 8వ, మరియు 9వ వచనములో అగుపించుచున్నది.

ఇతరులు అభ్యంతరపరచబడునట్లు హేతువగువాని గూర్చి చెప్పుచు, **వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలని** యేసు సెలవిచ్చాడు. వాడు ఒక విశ్వాసి విశ్వాసము విషయములో

అభ్యంతరము కలుగుటకు కారణమైనందునుబట్టి దేవుని తీర్పును ఎదుర్కొనుట కంటె, భయంకరమైన చావు నొందుట వానికి మేలనునది యేసు వారికి తెలియజెప్పుచుండిన సూచనయై యుండినది. ఇతరులు పాపము చేయుటకు కారణమగువాని అంతము కంటె, సముద్రములో ముంచివేయబడుట ఒక ఉత్తమమైన అంతమై యుండును (లూకా 17:2).[8]

ప్రాచీన ప్రపంచంలో అది మరణ శిక్ష విధింపబడుచుండిన ఒక అత్యంత సామాన్యమైన విధానమై యుండనప్పటికిని, ఉద్దేశపూర్వకమైన ముంపు సందర్భానుసారంగా అప్పుడప్పుడు సంభవించినది.[9] యేసు మనఃకల్పనలో మెడకు ఒక భారమైన తిరుగటి రాయి కట్టబడి సముద్రములో పడవేయబడువాడు బ్రతికి బయటపడుటకు అవకాశమే లేదు. వాని శరీరము సముద్రము అడుగు భాగానికి చేరుకొంటుంది, గనుక దానిని వెదికి వెలికి తీయుట అసాధ్యము. అలాగైతే, వాని మృతదేహము సరైన విధంగా పాతిపెట్టబడదు. అప్పటికి శిష్యులు యింకను కపెర్నహూములో ఉండిరి గనుక (మార్కు 9:33), మనస్సుకు వెంటనే తట్టు సముద్రము గలిలయ సముద్రమై యుండును.

NASB అనువాదములో "ఒక బరువైన తిరుగటిరాయి" అని వ్రాయబడియుండగా, గ్రీకు గ్రంథ పాఠము అక్షరాలా "ఒక గాడిద [లాగుచుండు] తిరుగటి రాయి" (*mulos onikos*) అని చెప్పుచున్నది. ఇది సమాజమునకు సంబంధించిన తిరుగలి లోని పై రాయియై యుండినది, ఈ రాయి ఒక పొడుగాటి కఱ్ఱ సహాయంతో గాడిద మెడకు లేదా ఒక ఎద్దు మెడకు కట్టబడినది.[10] ఈ గాడిద లేదా ఎద్దు గుండ్రముగా తిరుగుచు, పై రాయిని కూడ త్రిప్పుచుండును, తద్వారా కదలకుండా ఉండునట్లు పాతిపెట్టబడిన క్రింది తిరుగాలి రాయికిని, పై రాయికిని మధ్య నుండు ధాన్యము పిండి చేయబడును. బహు భారమైన ఈ తిరుగలి రాయికిని, ఇళ్ళలో స్త్రీలు ధాన్యము విసరుటకు ఉపయోగించు చేతి తిరుగాలి రాయికిని గల తారతమ్యమును గుర్తించవలెను (24:41). ఈ నాడు ప్రాచీన కపెర్నహూమును సందర్శించినట్లయితే అచ్చట ఒక రకమైన అగ్గిరాయితో తయారుచేయబడిన నానావిధ కొలతలలో గల తిరిగటి రాళ్లు కనిపించును.

**వచనము 7. అభ్యంతరముల వలన లోకమునకు శ్రమ**; అని పలుకుచు యేసు తన వివరమును కొనసాగించుచున్నాడు. "శ్రమ" అను మాట నీతిమంతమైన కోపమును ప్రతిబింబించుచున్నది, కానీ యేసు ప్రగాఢమైన దుఃఖము మరియు జాలితో ఈ మాట పలుకుచున్నాడు (11:21పై గల వ్యాఖ్యానము చూడు). ఇచ్చట మనముందున్న ఆయన వాంగ్మూలము సమష్టి లక్షణముగలదై యున్నట్లు అగుపించుచున్నది. పాపము మూలమున కలుషితమైపోయి, ఈ లోకము బొత్తిగా పతనమయ్యిందను వాస్తవమునకు ఇది చెడు చేయుచున్నది. యేసును వెంబడించువారు వారు అధిగమించి దాటవలసినవి **అభ్యంతరకరమగు అడ్డుబండలు** అనేకమున్నవి అనివార్యముగా కనుగొందురు. ఏదిఏమైనా, వారు మరొకరి మార్గములో అభ్యంతరకరమగు అడ్డుబండలు వేయుచున్నారను అపరాధిత్వ మనస్సు కలిగియుండకూడదు (రోమీయులకు 14:13; 1 కొరింథీయులకు 8:9–13; లేవీయ కాండము 19:14 చూడు).

ఆ తరువాత యేసు, **యెవనివలన అభ్యంతరము వచ్చునో ఆ మనుష్యునికి శ్రమ.** అని చెప్పాడు. ఈ భాష బహుశా ఇతరులు పాపము చేయుటకు కారణమగువారందరి అపరాధిత్వ భావమును సూచింపవచ్చును. యూదా తలపెట్టిన విద్రోహమును యేసు 26:24లో గట్టిగా

ఖండించుచుండినట్లు ఈ మాటలు గమనార్హముగా అదే విధమైన పదజాలమై యున్నది. "యెవనిచేత మనుష్యకుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ! ఆ మనుష్యుడు పుట్టియుండని యెడల వానికి మేలు" (26:24; NIV).

**వచనములు 8, 9.** చెడుతో గల సంబంధం సంపూర్ణంగా తెంచుకొనబడి అది బొత్తిగా విసర్జింపబడవలెనను పిలుపునిచ్చుటకు యేసు అతిశయోక్తులను ప్రయోగించుచున్నాడు– ఆశించిన ఫలితము నిమిత్తము ఆయన విషయమును పెద్దదిగా చేసి చెప్పుచున్నాడు. **నీ చెయ్యి, కాలు లేదా కన్నైనా** మరొకడు పాపము చేయుటకు హేతువైనట్లయితే, అది తొలగింపబడి పారవేయబడవలెనని ఆయన సెలవిచ్చాడు. ఈ సందర్భములో "కాలు" కలుపబడినప్పటికిని, ఈ వచనములు ఆయన కొండ మీద నుండి చేసిన ప్రసంగములో పలికిన ఉపదేశములను పునఃరుక్తము గావించుచున్నవి (5:29, 30పై గల వ్యాఖ్యానము చూడు).

స్వీయ వక్రీకరణమును యూదులు ఏవగింపు కలిగించు విషయముగా పరిగణించారు, గనుక యేసు చెప్పిన అతిశయోక్తులను ఇది యింకా ఎక్కువ బలపర్చుచున్నది. మత నిష్ఠలో కొన్ని తీవ్రమైన రూపములను అంటిపట్టుకొని యుండిన కొందరు స్వీయ వక్రీకరణము విశ్వసించుచు దానిని అభ్యసించారు (1 రాజులు 18:25–29). కొన్ని మతములలో గల కొరడా దెబ్బలు కొట్టుకొను వాడుక ఇందుకు ఒక ఉదాహరణము. కొందరు తమ్మును తాము కత్తులతో కోసికొందురు, ఏలయనగా అట్లు చేసికొనుట ద్వారా శరీరముతో పాపము చేయకుండ అది తోడ్పడుతుందని వారు నమ్మెదురు. ఆది క్రైస్తవులలో నుండిన కొందరు సన్యాసులు సహితము ఇటువంటి వాడుకలను అభ్యసించారు (కొలొస్సయులకు 2:23 చూడు). అట్లయినప్పటికిని, ఆధాత్మిక పవిత్రత విషయంలో అంతరంగ పురుషుని ప్రమేయము అసలు విషయమని యేసు మరొక చోట స్పష్టంచేసాడు (15:18, 19; 2 కొరింథీయులకు 10:5 చూడు).

ఒకడు వాని అవయవములన్నియు ఉన్నవి ఉన్నట్టుగా ఉంచుకొని **నిత్యాగ్నిలో పడవేయబడుట** కంటే, వాడు అవిటివాడుగా పరలోక రాజ్యములో ప్రవేశించుట ఎంతో ఉత్తమమని యేసు ప్రభువు నొక్కివక్కాణించాడు. "నిత్య" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*aiōnios*) దుర్మార్గుల శిక్షా కాలమున మరియు నీతిమంతుల ప్రతిఫలమును సూచించుచున్నది (25:46). రెండు సందర్భములలోను ఈ పదము అదే నిర్వచనము కలిగియుండవలెను.

8వ వచనములో పేర్కొనబడిన "నిత్యాగ్ని" 9వ వచనములో పేర్కొనబడిన **అగ్నిగల నరకము** యొక్క పర్యాయపదమై యున్నది. "నరకము" అని అర్థమిచ్చు గ్రీకు పదము *gehenna*, యెరూషలేమునకు దక్షిణమున నున్న హిన్నోము లోయ ఆధారంగా ఉత్పన్నమైన పదమై యున్నది. పాత నిబంధనలో, నైతికంగా అత్యంత నికృష్టమైన విషయాలకు ఈ చోటు ప్రసిద్ధిగాంచినదై, అటుతరువాత నిరంతరాయంగా మంటలు మండుచుండిన ఒక చెత్తకుప్ప అయ్యింది (5:22పై గల వ్యాఖ్యానము చూడు). యేసు నరకమును "ఆరని అగ్ని" గా "వారి పురుగు చావదు, అగ్ని ఆరని చోటుగా" వర్ణించాడు (మార్కు 9:43, 48).

## తప్పిపోయిన గొఱ్ఱె ఉపమానము వ్యక్తిగత శ్రద్ధ (18:10-14)

**[10]ఈ చిన్నవారిలో ఒకనినైనను తృణీకరింపకుండ చూచుకొనుడి. వీరి దూతలు, పరలోకమందున్న నా తండ్రి ముఖమును ఎల్లప్పుడు పరలోకమందు చూచుచుందురని మీతో చెప్పుచున్నాను. [11-12]మీకేమి తోచును? ఒక మనుష్యునికి నూరు గొఱ్ఱెలుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల తొంబదితొమ్మిదింటిని కొండలమీద విడిచివెళ్లి తప్పిపోయినదానిని వెదకడా? [13]వాడు దానిని కనుగొనిన యెడల తొంబదితొమ్మిది గొఱ్ఱెలనుగూర్చి సంతోషించునంతకంటె దానిని గూర్చి యెక్కువగా సంతోషించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. [14]ఆలాగుననే ఈ చిన్నవారిలో ఒకడైనను నశించుట పరలోకమందున్న మీ తండ్రి చిత్తముకాదు.**

తగ్గింపు (18:1-4) మరియు ఇతరులకు అభ్యంతరము కలుగుటకు కారణము కాకుండుట (18:5-9) గూర్చిన ప్రాముఖ్యతను నొక్కివక్కాణించిన అనంతరము, ప్రతి విశ్వాసి కూడ దేవుని దృష్టిలో ఎంతో విలువైనవారని యేసు తన శిష్యులకు ప్రబోధించాడు. ఈ విషయమును ఆయన గొఱ్ఱెను గూర్చిన చిన్న ఉపమానముతో సోదాహరణంగా చిత్రీకరించాడు (18:10-14).

**వచనము 10.** వస్తుగత సంబంధమైన పాఠములో ప్రయోజనకరంగా ఉండిన పసిపాప (18:2, 4, 5), యేసు తన ఉపదేశమును కొనసాగించుచుండినప్పటికి యింకా వారి మధ్యనే నిలువబడి యుండును. 6వ వచనములో వలెనే, **చిన్నవారు** అను పదము బహుశా శిష్యులందరికిని వర్తించి యుండును. యేసు శిష్యులలో ఏ ఒక్కరైనను ఎన్నడైనను తృణీకరింపబడకూడదు (రోమీయులకు 12:16; ఫిలిప్పీయులకు 2:3, 4). **తృణీకరించుట** అని అర్థమిచ్చు గ్రీకు పదము (*kataphroneō*) "హీనముగా పరిగణించుట" లేక "ఉన్నతముగా ఆలోచించుట" అని కూడ అనువదింపబడవచ్చును. మరొకరిని తన కంటె తక్కువవానిగా ఎంచుచు వాని యెడల తిరస్కారయుతముగా మెలగుట యని అర్థము.

ఇంకా **వీరి దూతలు పరలోకమందున్న నా తండ్రి ముఖమును ఎల్లప్పుడు పరలోకమందు చూచుచుందురని** చెప్పుచు యేసు తన సంభాషణను కొనసాగించాడు. ఈ ఘోషణ, క్రైస్తవులకు దేహసంరక్షణ నిచ్చుచుండు దేవదూతలు (NEB చూడు)-అనగా ఒక్కొక్కరికి కావలిగా ఉండుటకు ప్రతి క్రైస్తవునికి ఒక దేవదూత లేదా, అనేక మంది క్రైస్తవులకు కావలిగా ఉండుటకు ఒక దేవదూత యుండునను దృక్పథము కలిగించినది. హెబ్రీ పత్రిక రచయిత దూతలను, "రక్షణ యను స్వాస్థ్యము పొందబోవువారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకులైన ఆత్మలు" అని వర్ణించుచున్నాడు (హెబ్రీయులకు 1:14). ఏదిఏమైనా, ఒకొక్కరికి కావలిగా ఉండుటకు ప్రతి క్రైస్తవునికి ఒక దేవదూత ఉన్నాడనుట గూర్చి క్రొత్త నిబంధనలో స్పష్టమైన ఆధారము లేదు.

ఇచ్చట పేర్కొనబడిన దూతలు దేవుని సింహాసనమును సమీపించుటకు వారికి సునాయాస ప్రవేశము కలదు (లూకా 1:19 చూడు). "ముఖమును చూచుట" అను పదజాలము, ప్రాచీన కాలము నాటి న్యాయస్థానములో ఒకరు కలిగియుండిన గౌరవనీయమైన స్థానమును మరియు రాజు సముఖములో ఉండుటకు ఒక విశేషాధికారము కలిగియుండుటను సూచించు ఒక అభివ్యక్తమై యున్నది (1 రాజులు 10:8; 2 రాజులు

25:19; ఎస్తేరు 1:14, 15; యిర్మీయా 52:25 చూడు).[11] దూతలు ఎల్లప్పుడు దేవుని సముఖములో ఉన్నట్లుగానే, ఆయన భూమి మీద నున్న తన బిడ్డలను ఎల్లప్పుడు కనిపెట్టుకొని యుండును. "పరలోకమందున్న దేవుడు భూమి మీద తన ప్రజలు, వారు అత్యంత అల్పులైనా కూడ, ప్రతి ఒక్కరి పట్ల ఏర్పడుచుండు ప్రతి పరిస్థితిని ఎరిగియుంటున్నాడని" కంఠోక్తిగా ప్రకటించుటకు యేసు ప్రస్ఫుటమైన భాషను ప్రయోగించుచుండెను,[12] దేవుని "చిన్నవారిలో" ఏ ఒక్కరైనను అగౌరవముగా వ్యవహరింపబడినట్లయితే, అది ఆయనకు దృష్టికి కనుమరుగై యుండజాలదు.

**వచనము 11. ఏలయనగా తప్పిపోయిన దానిని రక్షించుటకై మనుష్యకుమారుడు వచ్చెను.** ఆది గ్రీకు చేతిరాత ప్రతులలో ఈ వచనము వ్రాయబడి లేదు. NASB ఈ వచనము కుండలీకరణము గావించి యుండగా, అనేక ఆధునిక బైబిల్ అనువాదములు దానిని సూచనలుగా గావించినవి (NEB; TEV; NIV; NRSV; NJB; NCV; CEV; NLT). 10వ వచనము నుండి 12వ వచనమునకు జరుగుచున్న మార్పును సుగమము చేయుటకు అది వైద్యుడై యుండిన లూకా వ్రాసిన సూవార్త నుండి నకలు చేయబడినదని బ్రూస్ ఎమ్ మెట్జ్‌గర్ సూచించుచున్నాడు.[13] "వెదికడా," అను మాట అదనంగా చేర్చబడుచు, ఇదే ప్రకటన లూకా 19:10లో కలదు: "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" మత్తయి వ్రాసిన సువార్తలో కలుపబడుటకు తీసికొనబడిన వాక్యము నిశ్చయముగా అసలు సత్యమును బోధించుచున్నది. ఔను యేసు నిజముగా నశించిన వారిని వెదకి రక్షించుటకు ఈ లోకమునకు వచ్చాడు, గనుక 12 మొదలుకొని 14వ వచనము వరకు గల ఉపమానము ఈ వాస్తవమును సోదాహరణ ంగా చిత్రీకరించుచున్నది.

**వచనము 12. మీకేమి తోచుచున్నది?** అని వారినడుగుచూ యేసు గొఱ్ఱెను గూర్చిన గొప్ప ఉపమానము మొదలుపెట్టాడు. తన శిష్యుల సావధానమును ఆకర్షించుచున్నట్లును, వారి ఆలోచనల్లో చురుకుదనం పుట్టించునట్లును యేసు ఈ ప్రశ్న వేసాడు (17:25; 21:28; 22:42 చూడు).

మత్తయి వ్రాసిన సువార్తలో ఈ ఉపమానము ఒంటిగా నున్నది, కానీ లూకా వ్రాసిన సువార్తలో అది పోగొట్టుకొనబడిన విషయముల గూర్చి చెప్పబడిన మూడు ఉపమానములలో ఒకటై యున్నది (లూకా 15వ అధ్యాయం). ఇతరమైన రెండు ఉపమానములు పోగొట్టుకొనబడిన నాణెము మరియు తప్పిపోయిన పిల్లవాని గూర్చినవై యున్నవి ఈ రెండవ ఉపమానము అతి తరచుగా "తప్పిపోయిన కుమారుని ఉపమానము" అని పిలువబడుచున్నది. తప్పిపోయిన **గొఱ్ఱెల** గూర్చిన ఇదే విధమైన ఉపమానములు రెండు వేర్వేరు సందర్భములలో తెలియజెప్పబడినవని తెలియుచున్నది. మత్తయి వ్రాసిన సువార్తలో ఈ ఉపమానము యేసు శిష్యుల నుద్దేశించి చెప్పబడినది (18:1), అయితే లూకా వ్రాసిన సువార్తలో అది పరిసయ్యులను మరియు శాస్త్రుల నుద్దేశించి చెప్పబడినది (లూకా 15:2, 3). గనుక వేర్వేరు సువార్తలలో నున్న ఈ రెండు కథల వివరములలో గల కొద్దిపాటి వ్యత్యాసములకు కారణము కనబడుచున్నది.

దేవుని ప్రజలు గొఱ్ఱెలుగా చిత్రింపబడుట పాత మరియు క్రొత్త నిబంధనలో సామాన్యమైన సంగతై యున్నది (9:36; 10:5, 6పై గల వ్యాఖ్యానము చూడు). సోదాహరణ

చిత్రీకరణములలో **తొంబది తొమ్మిది** మరియు **ఒకటి** అని పేర్కొనబడు సంఖ్యలు కూడ యూదా మతములో సాధరణ విషయమై యుండినది.[14] కీనర్ చెప్పుచున్న దాని ప్రకారము,ఒక మందలో సగటున **నూరు** గొఱ్ఱెలుండినవి; గనుక ఒక్క గొఱ్ఱెల కాపరి తగు జాగ్రత్త వహించుటకు ఇది సులభముగా నుండినది.[15] ఈ నూరు గొఱ్ఱెల గూర్చి తగు శ్రద్ధ వహించుచు, ఉపమానములో చెప్పబడిన కాపరి ఒక గొఱ్ఱె తప్పిపోయిందని సులభముగా పసిగట్టగలిగాడు. మంచి కాపరి తన గొఱ్ఱెలను అత్యంత ఆత్మీయముగా ఎరుగును, గనుక ఆయన వాటిని పేరు పెట్టి పిలుచునని యేసు సెలవిచ్చాడు (యోహాను 10:1–18). దారి తప్పిపోని తొంబది తొమ్మిది గొఱ్ఱెలు, తప్పిపోయిన ఒక్క దాని కంటె తక్కువ విలువగలవేమీ కాదు అయితే తప్పిపోయిన ఆ ఒక్కటి అనేక కోణాలలో నుండి చుట్టిముట్టి యుండిన అపాయములో చిక్కుకొనినది. కాబట్టి, కాపరి తప్పిపోయిన ఆ ఒక్క గొఱ్ఱెను ఎంత త్వరగా వెదకి పట్టుకొనగలిగితే అంత మంచిది. వాక్యములో **విడిచి వెళ్లడా** (*ouchi*) అను పదం వ్యతిరేకార్థక ఉద్ఘాటన ఉపయోగింపబడుట, ప్రశ్న ఒక నిశ్చయాత్మకమైన జవాబును ఆశించుచున్నదని కనుపర్చుచున్నది; సహజంగానే, కాపరి తప్పిపోయిన ఆ ఒక్క గొఱ్ఱెను అది దొరుకు వరకు దానిని వెదకుచుండును.

**వచనము 13. వాడు దాని కనుగొనిన యెడల తొంబది తొమ్మిది గొఱ్ఱెలను గూర్చి సంతోషించు నంతకంటె దానిని గూర్చి యెక్కువగా సంతోషించునని** చెప్పుచు యేసు తన ఉపమాన ఉపదేశమును కొనసాగించాడు. "... యెడల" అను పదము కొన్ని పర్యాయములు తప్పిపోయిన గొఱ్ఱె దొరకకపోవచ్చునని అంగీకరించుచున్నది; ఆ గొఱ్ఱె దారి తప్పి చాల దూరం వెళ్లిపోయి యుండును లేదా, అడవి మృగములకు ఆహారమైపోయి యుండును. ఏదిఏమైనా, తప్పిపోయిన గొఱ్ఱెను కాపరి కనుగొనినప్పుడు, అందరు ఎంతో సంతోషించుదురు. ఈ ఉపమానమును లూకా వ్రాయుచున్న వివరములలో, "అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తమ భుజము మీద వేసుకొని యింటికి వచ్చును ..." అని యేసు పలికిన అదనపు మాటలు వ్రాయబడి యున్నవి (లూకా 15:5). కాపరి ఆ గొఱ్ఱె అవసరములేమిటో కనుగొని అతి జాగ్రత్తతో వాటిని తీర్చి ఆ తరువాత దానిని మందలో చేర్చి తన స్నేహితులు మరియు పొరుగువారితో కలిసి తప్పిపోయి గొఱ్ఱె దొరికినందుకు ఎంతో సంబరపడును (లూకా 15:6). ఈ ఉపమానమును అన్వయించుచు, యేసు, "అటువలె అక్కరలేని తొంబది తొమ్మిది మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సుపొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగునని" చెప్పాడు (లూకా 15:7).

**వచనము 14. ఈ చిన్నవారిలో ఒకడైనను నశించుట** దేవునికిష్టములేదని చూపించుట ఉపమానములోని ఉపదేశ సారమై యున్నది. ఏ ఒక్కరైనను శాశ్వతముగా ఆయనకు వేరుగా ఉండకూడదని ఆయన కోరుచున్నాడు(యోహాను 3:16; 2 పేతురు 3:9; 2 థెస్సలొనీకయులకు 1:6–10 చూడు). దేవుడు తన కుమారుని, మంచి కాపరిని, తప్పిపోయిన గొఱ్ఱెలను వెదకి రక్షించునిమిత్తము ఈ లోకమునకు పంపాడు ఈ ఉపమానము ప్రతి ఒక్కరి ప్రాముఖ్యతను నొక్కి వక్కాణించుచు, యేసు ప్రభువు ప్రజల యెడల ప్రదర్శించిన ఆసక్తి అది ఒక్కొక్కరి గూర్చిన వ్యక్తిగతమైన చింతయై యుండినదని మనకు గుర్తుచేయుచున్నది.[16]

### సంఘర్షణలను సరిదిద్దుకొనుట: క్రమశిక్షణ మరియు సహవాసము (18:15-20)

**[15]మరియు నీ సహోదరుడు నీయెడల తప్పిదముచేసినయెడల నీవు పోయి, నీవును అతడును ఒంటరిగానున్నప్పుడుఅతనిని గద్దించుము; అతడు నీ మాట వినినయెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి. [16]అతడు విననియెడల, ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాట స్థిరపరచబడునట్లు నీవు ఒకరినిద్దరిని వెంటబెట్టుకొని అతనియొద్దకు పొమ్ము. [17]అతడు వారి మాటయు విననియెడల ఆ సంగతి సంఘమునకు తెలియజెప్పుము; అతడు సంఘపు మాటయు విననియెడల అతనిని నీకు అన్యునిగాను సుంకరిగాను ఎంచుకొనుము. [18]భూమి మీద మీరు వేటినిబంధింతురో, అవి పరలోకమందును బంధింపబడును; భూమి మీద మీద మీరు వేటిని విప్పుదురో, అవి పరలోకమందును విప్పబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. [19]మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనినిగూర్చియైనను భూమిమీద ఏకీభవించినయెడల అది పరలోకమందున్న నా తండ్రివలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను. [20]ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను.**

యేసు ప్రభువు క్షమాపణ గూర్చి ఎంతో బోధించాడు, కానీ ఆయన అనుచరులు పాపము గూర్చి పట్టించుకొనాల్సిన పనిలేదనుకొనవలెనని ఆయన ఎన్నడును ధ్వనించలేదు. ఈ సందర్భములో ఆయన పాపము చేయు సహోదరులతో మనము ప్రవర్తించాల్సిన సరైన విధానమును సంక్షేపముగా వర్ణించాడు (18:15-17). ఈ ఆదేశము తరువాత ఆయన ఇతరులను బంధించుట మరియు విప్పుట గూర్చి తన అపొస్తలులకు ఒక ప్రత్యక్షతను ప్రదర్శించాడు (18:18-20).

**వచనము 15.** ఈ వచనము **నీ సహోదరుడు ... తప్పిదము చేసిన యెడల** అను నియమబద్ధ ఒక ఉపవాక్యముతో మొదలగుచున్నది. కొన్ని ప్రాచీన గ్రీకు చేతిరాత ప్రతులలో "నీకు విరోధముగా" అను అదనపు విభక్త్యర్థ ఉపవాక్య పదజాలము వ్రాయబడి యున్నది, ఈ మాటలు ఈ ఉపవాక్యమును ఎక్కువ నిర్దిష్టమైనదిగాను, వ్యక్తిగతమైనదిగాను చేయుచున్నవి.[17] "నీకు విరోధముగా" అను ఈ పదజాలము వ్యాటికేనస్ మరియు, సైనాయ్‌టికస్‌లలో (అతి ప్రాచీనమైన చేతిరాత నకలులు అని అనేకుల చేత పిలవబడుచున్న వాటిలో) అగుపించకపోయినప్పటికిని, అది అనేక ఆధునిక బైబిల్ అనువాదములలో చేర్చబడినది (TEV; NIV; NRSV; NKJV; CEV; NCV; NLT). ఈ మాటలు ఆదిమ మూలమైనవో కాదో అను విషయముతో నిమిత్తము లేకుండా, నీ యెడల తప్పిదము చేసిన సహోదరుడును నీవును ఒంటరిగా నున్నప్పుడు విషయమును చర్చించి అతనిని గద్దింపవలెనని ఇవ్వబడుచున్న ఆజ్ఞనుబట్టి చూచినట్లయితే ఇదొక వ్యక్తిగతమైన ఉల్లంఘన నేరమై యుండునని విల్యమ్ హెండ్రికసెన్ విశ్వసించాడు.[18] H. L. మ్యాన్సెల్ మన సావధానమును సందర్భము వైపునకు మళ్లించుచున్నాడు. దీనికి ముందున్న చర్చ యేసునందు విశ్వాసముంచుచున్న చిన్నవారిలో ఒకనినైనను అభ్యంతరపరచకుండుట గూర్చినదై యుండినందు వలన, చేయబడిన పాపము వ్యక్తి గతమైనదై యుండినదని భావించుట సహేతుకమై యుండునని చెప్పుచున్నాడు.[19] ఇంకా, 21వ వచనములోని పేతురడిగిన ప్రశ్న, మరొక క్రైస్తవునికి విరోధముగా చేయబడిన వ్యక్తిగతమైన పాపమును యేసు సూచించుచుండెనను అభిప్రాయముతో

ఏకీభవించుచున్నట్లున్నది.

"సహోదరుడు" (*adelphos*) అను పదము యేసు క్రీస్తు నందలి ఆధ్యాత్మిక కుటుంబమునకు చెందినవారిని (12:46–50; 25:40; 28:10), సంఘమును (16:18; 18:17) సూచించుచున్నది. ఈ సందర్భములో, అది జాతి యంతటికి సంబంధించినదై యుండి, స్త్రీలకును పురుషులకును వర్తించుచున్నది. వారు, స్త్రీలైనా పురుషులైనా, క్రీస్తునందున్న మరొక సహోదరుడు లేదా సహోదరి యెడల పాపము చేయు దేవుని పిల్లలెవరైనను సంధింపబడవలెను. ఇది కేవలము ఒక అపార్థము, ఒక అల్పమైన విషయం, స్పష్టముగా అగుపించుచున్న తప్పు అప్రధానమైన ఒక అంశము, లేదా ఒక భేదాభిప్రాయము కాదు. యేసు ఒక "పాపము" గూర్చి చెప్పుచుండెను; "పాపములు" (*hamartanō*) అను పదమును వర్ణించుటకు మత్తయి సువార్తీకుడు అత్యంత మౌలికమైన గ్రీకు పదమును ప్రయోగించాడు.

ఒకనికి విరోధముగా పాపముచేయబడినవాడు బాధ్యత వహించవలసి యున్నది. అతడు లేదా ఆమె తనకు విరోధముగా పాపము చేసిన వ్యక్తిని మృదుత్వము మరియు వినయముగల స్ఫూర్తితో సంధించవలెను (గలతీ 6:1). యేసు, **నీవు పోయి నీవును అతడును ఒంటరిగా నున్నప్పుడు, అతనిని గద్దించుమని** సెలవిచ్చాడు. "అతనిని గద్దించుము" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*elenchō*) "బయట పెట్టుము," "ఒప్పించుము," లేదా "మందలించుము" అను భావమును తెలుపుచున్నది. "అది నా తప్పు కాదు! గనుక అతడే/ఆమెయే నా యొద్దకు రావలెను" అనునది ప్రజల మనస్సుల్లో నెలకొనియున్న ఒక సామాన్య వైఖరై యున్నది. ఏదిఏమైనా, "నీవు పోయి" అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.[20] విషయమేమనగా, అతని మనస్సు గాయపర్చబడునట్లు తప్పిదము చేయబడిన సహోదరుడు లేక సహోదరి, తన యెడల చేయబడిన పాపము గూర్చి, తన యెడల తప్పిదము చేసిన వ్యక్తితో మాత్రమే సంప్రదించవలెను, ఇతరులతో కాదు. విషయమును సాధ్యమైనంత వరకు వ్యక్తిగతముగానే నిలిపియుంచుకొనవలెను.

యేసు, "**అతడు నీ మాట వినినయెడల, నీ సహోదరుని సంపాదించుకొంటివని**" సెలవిచ్చాడు. మనస్సు గాయపర్చబడినవాడు, తన మనస్సును గాయపర్చినవానిని క్షమించుటకు ఇష్టపడవలెను; లేదంటే, తప్పిదము చేసిన సహోదరుడు "సంపాదించుకొనబడడు." అన్నిటిని మించి, అతడు లేక ఆమె తన మనస్సును గాయపర్చిన వ్యక్తిని "సంపాదించుకొనవలెనను" అభిప్రాయంతో అతని యొద్దకు వెళ్లవలెనే గాని, వాదప్రతివాదములో గెలుచు (*kerdainō*) నిమిత్తము కాదు. "సంపాదించుకొనుట" అని అర్థమిచ్చు గ్రీకు పదము నశించిన వారిని రక్షించవలసిన సందర్భములో ఉపయోగింపబడినది (1 కొరింథీయులకు 9:19–24), కానీ దారి తప్పిన వానిని సరైన దారిలోనికి మళ్లించుట కూడ అంతే ప్రాముఖ్యమై యున్నది. యాకోబు ఇలా వ్రాయుచున్నాడు, "నా సహోదరులారా, మీలో ఎవడైన సత్యము నుండి తొలగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్లించినయెడల, పాపిని వాని తప్పు మార్గము నుండి మళ్లించువాడు మరణము నుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను" (యాకోబు 5:19, 20; యూదా 22, 23 చూడు).

**వచనము 16.** గద్దింపబడినవాడు మొదటిసారి గద్దించిన తరువాత మారుమనస్సు

నొందనట్లయితే, అతని యొద్దకు మరొక పర్యాయము వెళ్లవలెనని యేసు చెప్పుచున్నాడు: **అతడు విననియెడల, ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాట స్థిరపరచబడునట్లు నీవు ఒకరిద్దరిని వెంటబెట్టుకొని అతని యొద్దకు వెళ్లుము** మనస్సు గాయపర్చబడిన వానితో కూడ "ఒకరు లేక ఇద్దరు" ఉన్నప్పుడు, సంభాషణ ఇద్దరు ముగ్గురు సాక్షుల యెదుట జరుగునని అర్థము. భేదాభిప్రాయములను పరిష్కరించుకొనుటకు లేదా వాస్తవములను ధ్రువీకరించుకొనుటకు ఇతరులకు ప్రమేయము కల్పించుట ఎంతో కాలంగా ప్రయోగింపబడుచుండిన నియమమై యుండినది (సంఖ్యాకాండము 35:30; ద్వితీయోపదేశకాండము 17:6; 19:15; 2 కొరింథీయులకు 13:1). ఇటువంటి ప్రమేయము వలన సంభాషణ వినినవారు ఒకరి కంటె ఎక్కువ మంది ఉండిరనుటకును, జరిగినదేమిటో తెలిసినవారు ఉన్నారనుటకును రుజువుగా నిలుచును–అప్పుడు ప్రతి వాస్తవము సులభముగా రూఢిపర్చుకొనబడవచ్చును. ఇది మరొక ఉద్దేశమునకు కూడ ప్రయోజనకరమగును: విషయము మనస్సు గాయపర్చబడినవాడు అనుకొనునంత గంభీరమైనదై యుండకపోవచ్చును, అప్పుడు అచ్చట నుండి మూడవ వ్యక్తి అసలు విషయమేమిటో చక్కగా అర్థమగునట్లు వివరించగలడు మరియు తద్వారా విషయమును చక్కదిద్దగలడు.

**వచనము 17.** రెండవ గద్దింపు తరువాత, అప్పటికి కూడ పాపము చేసినవాడు మారుమనస్సు నొందనట్లయితే, ఏకాంతమున వ్యక్తిగతమై యుండిన విషయము ఇప్పుడు నలుగురికి తెలియునట్లు బహిరంగము చేయబడవలెను. ఈ విషయాన్ని **సంఘము,** అనగా స్థానిక సంఘ సభ్యుల యెదుటికి తీసికొనిరావలెను (16:18పై గల వ్యాఖ్యానము చూడు). విషయము ఎంత తీవ్రమైనదగునంటే, పాపము చేసినవాడు మారుమనస్సు నొందనట్లయితే, వాడు వాని ఆత్మను కోల్పోవును. ఇది వాస్తవము గనుక, పాపము చేసినవాడు వానికి అగత్యమైయున్న మారుమనస్సు నొందుటకు ప్రోత్సాహింపబడునట్లు, సంఘమంతయు కలసి ఏక కంఠంతో ప్రార్థనలు చేయుచు వానిని మందలించవలెను. మరియు, తప్పిదము చేసిన సహోదరుని సంఘములోనికి మరలా సంపాదించుకొనవలెననునదే ముఖ్య ఉద్దేశము (18:15).

ఈ మూడవ మందలింపు కూడ విఫలమైనట్లయితే, మారుమనస్సునొంద నొల్లని అపరాధి **సంఘము చేత** సరైన క్రమశిక్షణలోనికి తీసుకురాబడవలెను. ఈ చర్యలో సహితము, తిరుగుబాటుదారుడుగా వ్యవహరించుటనుబట్టి అపరాధియైనవాడు సంఘ సహవాసమునకు దూరం చేయబడినప్పటికిని, వాడు మారుమనస్సునొంది రక్షణలోనికి రావలెననునదే లక్ష్యమై యుండవలెను (1 కొరింథీయులకు 5:4, 5; 2 థెస్సలొనీకయులకు 3:14, 15; 1 తిమోతి 1:20; తీతుకు 3:10, 11). యేసు, **అతనిని నీకు అన్యునిగాను సుంకరిగాను ఎంచుకొనుమని** సెలవిచ్చాడు. అన్యజనులు మరియు సుంకరులు వారి దుష్ట విధానములకు పేరుగాంచినవారై యుండిరి (5:46, 47పై గల వ్యాఖ్యానము చూడు). సామాన్యముగా, యూదులు వారుతో కలసి భోజనము చేయరు, లేక వారి ఆస్తిపాస్తులను తమ ఇళ్లలోనికి తీసుకొనివెళ్లరు. వారితో ఎటువంటి సంబంధమైనను కలిగియుండరు. యేసు ఈ వైఖరిని బాహాటముగా ఖండించనప్పటికిని, ఆయన తన సోదాహరణ చిత్రీకరణములలో ఈ విషయాన్ని అప్పుడప్పుడు, అవకాశము వచ్చినప్పుడు, సద్వినియోగము

చేసికొన్నాడు (ఉదా॥ 8:5-13; 9:9-13; 18:17 చూడు).[21]

మత్తయి 18:15-17లో యేసు సంక్షిప్తముగా వర్ణించిన పద్ధతి యూదా మతములో అభ్యసింపబడుచుండిన దాని వంటిదే. ఖుమ్రాన్ తెగకు చెందినవారిలో, మనస్సుగాయపర్చబడిన సభ్యుడు వానికి విరోధముగా తప్పిదము చేయబడిన అదే దినము తన సహోదరుని గద్దింపవలెనని ఆదేశింపబడి యున్నాడు (లేవీయకాండము 19:17 చూడు). మనస్సు గాయపర్చబడినవాడు విషయమును బహిరంగ సమావేశము యెదుటికి తీసుకురాక మునుపు, అతనికి విరోధముగా అపరాధము చేసినవానిని అతడు తనతో కూడ సాక్షులను వెంటబెట్టుకొని వెళ్లి మందలించవలెను.[22]

ఖుమ్రాన్‌లో నివసించుచు తిరుగుబాటుదారులై యుండినవారు సమాజములో నుండి వెలివేయబడిరి. యూదా మతములోని ప్రధాన విభాగములో, ప్రజలు సమాజమందిరములలో ప్రవేశింపకుండునట్లు సహితము సంఘములో నుండి వెలివేయబడిరి (యోహాను 9:22; 12:42). ప్రజలను క్రమశిక్షణలో నియంత్రించుటకు సమాజమందిర నాయకులు వారిని కొరడా దెబ్బలు కొట్టించుచుండిరి (10:17)[23]–ఈ అభ్యాసమునకు క్రైస్తవులలో తావు లేదు.

**వచనము 18.** ఆ తరువాత, యేసు, **భూమి మీద మీరు వేటిని బంధింతురో అవి పరలోకమందును బంధింపబడును; భూమి మీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోకమందును విప్పబడునని** చెప్పెను. ఆయన ఈ ప్రకటన చేసినప్పుడు, ప్రభువు అపొస్తలులను సూచించుచుండెను (18:1 చూడు). ఈ విషయము స్పష్టముగా సంఘము కొరకు సహితము ఉద్దేశింపబడినది (18:17 చూడు). ఇదే ప్రకటన పేతురు విషయములో చెప్పబడినది (16:19పై గల వ్యాఖ్యానము చూడు), గనుక అతనికి ఇతర శిష్యులను మించిన ప్రాధాన్యత ఇవ్వబడలేదు (యోహాను 20:23 చూడు). అపరాధము చేసినవాడు సమర్థింపబడుటకు సముచితముగా నుండు విధముగా భూమి మీద సంఘము చేత సహవాసములో నుండి వెలివేయబడినట్లయితే (1 కొరింథీయులకు 5:11, 12) చూడు, అది పరలోకమందలి న్యాయస్థానములో అదివరకే నిర్ణయింపబడిన దానిని ప్రతిబింబించుచున్నదని ఈ సందర్భములో చేయబడిన ప్రకటన నిశ్చయముగా అర్థమునిచ్చుచున్నది. మారుమనస్సు నొంద నొల్లని పాపిని సంఘ సహవాసములో నుండి తొలగించుట ద్వారా, సంఘ సభ్యులు కేవలము పరలోకములో తీర్చబడిన తుదితీర్పు గూర్చి వారి సమ్మతిని తెలియజేయుచున్నారు.[24] చట్ట రీత్య లేదా నైతికంగా ఏది అనివార్యమైనదో ఏది కాదో, కేవలము మామూలుగా ఘోషించు నిమిత్తము కాదు, కానీ సహవాసము మరియు సహవాసములో నుండి వెలివేయుట గూర్చిన సందర్భములో "బంధింపబడును" మరియు "విప్పబడును" అను పదములను జోసీఫస్ ఉపయోగించాడనునది గమనార్హమైన విషయమై యున్నది.[25]

**వచనము 19**. ఆ తరువాత యేసు, **మరియు మీలో ఇద్దరు తాము వేడుకొనిన దేనిని గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన యెడల, అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరుకునని** సెలవిచ్చాడు. ఏకీభవించు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*sumphōneō*) స్వర మేళనము అని అర్థమిచ్చు ఆంగ్ల పదము "symphony"కి ఆధారమైయున్నది. ఈ సందర్భములో పేర్కొనబడిన, "ఇద్దరు" (ఇది 16వ వచనములోగల ప్రకటనను గుర్తు

చేయును) ఒకరితో నొకరు అన్యోన్య సామరస్యముతో ఉన్నారు. పాపియైనవాడొకడు మారుమనస్సునొందాడని లేదా మారుమనస్సు నొందలేదని ఇద్దరు విశ్వసనీయమైన శిష్యులు ఏకీభవించినట్లయితే, వారి నిర్ణయము దేవుని చేత ఆమోదింపబడునని రూఢిపర్చబడినవారై యుండవచ్చును. ఏ విషయములోనైనను ఇద్దరు క్రైస్తవులు ఏకీభవించినట్లయితే దానిని దేవుడు ఆమోదిస్తాడని బోధించుటకు ఈ ప్రకటన ప్రయోగింపబడ నేరదు. ఇవ్విధముగా చేయబడు వాగ్దానము దేవుణ్ణి ప్రజల చపలచిత్తమైన వెర్రి తలంపుల వశముచేయును. దీని అర్థము అది కాదు. ఏది సరైనది మరియు ఏది దేవుని చిత్తప్రకారమైనదై యున్నదను సందర్భములో, ఇద్దరు శిష్యులు దేనినడిగినను అది అనుగ్రహింపబడునని దీని అర్థమై యున్నది (1 యోహాను 5:14, 15 చూడు).

**వచనము 20.** దేవుని ఆరాధించుటకు **ఇద్దరు లేక ముగ్గురు** (సంఖ్యాపరంగా) క్రైస్తవులు గల ఒక కూడికను సూచించుటకు ఈ వచనము తరచుగా ఉపయోగింపబడుచున్నది. ఇందులో సమావేశము నిశ్చయముగా కలిసియున్నది. ఏదిఏమైనా, ఈ మాటలను మనము ప్రస్తుత సందర్భమునకు అన్వయిస్తూ అర్థంచేసికొనవలెను. ఇచ్చట పేర్కొనబడిన ఇద్దరు లేక ముగ్గురు దేవుని ఆరాధించుటకు **కూడుకొనలేదు.** ఒకని మనస్సును గాయపర్చిన సహోదరుడు లేక సహోదరి, తాను చేసిన తప్పిదము గూర్చి అతడు లేక ఆమె మారుమనస్సు నొందరని లేదా పశ్చత్తాపపడలేదని ఒప్పుకొనుచుండిన విషయము నిజమని నిశ్చయపర్చుటకు వారు కూడుకొని యుండిరి. ఇటువంటి సందర్భములలో ఆయన తన సన్నిధి ప్రసన్నతను వారితో కూడ ఉంచుచు వారికి తన తోడ్పాటును అనుగ్రహించునని యేసు వాగ్దానము చేసాడు: **నేను వారి మధ్యన ఉందును.**

ఈ ప్రకటన యూదా మత బోధకులు వారి శిష్యులకు బోధించిన దాని వలెనే ఉన్నది. తీర్పు తీర్చుటకు ఇద్దరు లేక ముగ్గురు పురుషులు కూర్చుండునప్పుడు, **షెకీనా** *Shekinah* (దైవ సన్నిధి) వారి మధ్యన ఉండునని వారు చెప్పుచుండిరి.[26] యేసు నిజముగా "మనకు తోడుగా" ఉన్నాడు (1:23); గనుక, యింకా ఎక్కువ సామాన్యంగా, ఆయన తన సన్నిధి ప్రసన్నత తన సంఘముతో యుగ సమాప్తి పర్యంతము సదాకాలముండునని వాగ్దానము చేసాడు (28:20).

### కరుణించని దాసుని ఉపమానము: క్షమాపణ (18:21-35)

**21ఆ సమయమున పేతురు ఆయనయొద్దకు వచ్చి-ప్రభువా, నా సహోదరుడు నాయెడల**
**తప్పిదము చేసినయెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడుమారులమట్టుకా?**
**అని అడిగెను. 22అందుకు యేసు అతనితో ఇట్లనెను ఏడుమారులుమట్టుకే కాదు,**
**డెబ్బది ఏళ్ల మారులమట్టుకని నీతో చెప్పుచున్నాను. 23కావున పరలోకరాజ్యము, తన**
**దాసులయొద్ద లెక్క చూచుకొన గోరిన యొక రాజును పోలియున్నది. 24అతడు లెక్క**
**చూచుకొన మొదలుపెట్టినప్పుడు, అతనికి పదివేల తలాంతులు అచ్చియున్న యొకడు**
**అతని యొద్దకు తేబడెను. 25అప్పు తీర్చుటకు వానియొద్ద ఏమియు లేనందున, వాని**
**యజమానుడు వానిని, వాని భార్యను, పిల్లలను వానికి కలిగినది యావత్తును అమ్మి,**
**అప్పు తీర్చవలెనని ఆజ్ఞాపించెను. 26కాబట్టి ఆ దాసుడు అతని యెదుట సాగిలపడి**
**మ్రొక్కి-నాయెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతునని చెప్పగా 27ఆ దాసుని**

**యజమానుడు కనికరపడి, వానిని విడిచిపెట్టి, వాని అప్పు క్షమించెను. 28అయితే ఆ**
**దాసుడు బయటకు వెళ్లి తనకు నూరు దేనారములు అచ్చియున్న తన తోడిదాసులలో**
**ఒకనినిచూచి, వాని గొంతు పట్టుకొని–నీవు అచ్చియున్నది చెల్లింపుమనెను 29అందుకు వాని**
**తోడి దాసుడు సాగిలపడి–నాయెడల ఓర్చుకొనుము, నీకు చెల్లించెదనని వానిని వేడుకొనెను**
**గాని 30వాడు ఒప్పుకొనక అచ్చియున్నది చెల్లించువరకు వానిని చెరసాలలో వేయించెను.**
**31కాగా వాని తోడి దాసులు జరిగినది చూచి, మిక్కిలి దుఃఖపడి, వచ్చి, జరిగినదంతయు**
**తమ యజమానునికి వివరముగా తెలిపిరి. 32అప్పుడు వాని యజమానుడు వానిని**
**పిలిపించి–చెడ్డ దాసుడా, నీవు నన్ను వేడుకొంటివి గనుక నీ అప్పంతయు క్షమించితిని;**
**33నేను నిన్ను కరుణించిన ప్రకారము నీవును నీ తోడిదాసుని కరుణింపవలసి యుండెను**
**గదా అని వానితో చెప్పెను. 34అందుచేత వాని యజమానుడు కోపపడి, తనకు అచ్చియున్న**
**దంతయు చెల్లించు వరకు బాధపరచువారికి వాని నప్పగించెను. 35మీలో ప్రతివాడును**
**తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపనియెడల నా పరలోకపు తండ్రియు ఆ**
**ప్రకారమే మీయెడల చేయుననెను.**

యేసు బోధ ఇప్పుడు క్షమాపణ గూర్చినదై యున్నది. పాపము చేసిన ఒక సహోదరుని సరిదిద్దుట గూర్చి ఆయన చెప్పిన వివరము, వ్యక్తిగతముగా తన యెడల తప్పిదము చేసిన ఒక సహోదరుని క్షమించుట గూర్చి ప్రభువును అడుగునట్లు పేతురులో ప్రోత్సాహకము కలుగజేసినది (18:21). యేసు పేతురడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చి (18:22), అటుతరువాత కరుణించని దాసుని ఉపమానము చెప్పుచు క్షమాపణా సూత్రమును సోదాహరణంగా చిత్రీకరించాడు (18:23–35).

**వచనము 21**. మరొక పర్యాయము, మత్తయి సువార్తీకుడు పేతురు పేరు ప్రాముఖ్యంగా పేర్కొనబడిన మరొక సన్నివేశమును మనముందుంచుచున్నాడు (14:28–32; 15:15; 16:16–19, 22, 23; 17:4, 24–27). ఈ సంఘటనలో, అపొస్తలుడైన పేతురు **ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్నిమారులు అతని క్షమింపవలెను?** అని యేసునడిగాడు. "క్షమించుట" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*aphiēmi*) అక్షరాలా "వదిలిపెట్టుము" లేక "పంపివేయుము" అను అర్థమునిచ్చును. బోధ చేయబడుచుండిన ఈ సమయంలో, నైతిక ఋణమును రద్దుచేయుట గూర్చి చెప్పుటకు ఈ మాట ఉపయోగింపబడినది. ఒకడు మరొకనిని **ఏడు మారుల మట్టుకు** క్షమించవచ్చునని సూచించుట ద్వారా అతడు అత్యంత కరుణగలవాడై యుంటున్నాడని పేతురనుకొన్నాడు. ఎంతైనా, ఎవరైనా ఒకరిని మూడు పర్యాయములు క్షమించుట సరిపోతుందని యూదా మత బోధకులు ఉపదేశించారు. "ఒకడు అతిక్రమించినట్లయితే, వాడు మొదటిసారి, రెండవసారి, మరియు మూడవసారి కూడ క్షమింపబడును, కాని నాలుగవసారి అతడు క్షమింపబడడని" యూదా మత బోధకుడైన జోస్‌బెన్ జూడా చెప్పుచున్నాడు.[27]

**వచనము 22**. యేసు అతనిని పొగడునని ఆశించిన పేతురు దానికి బదులుగా, అతడు తన యజమానుడైన వాని చేత సున్నితముగా గద్దింపబడినాడు: **ఏడు మారులమట్టుకే కాదు, డెబ్బది ఏళ్ళ మారులమట్టుకని నీతో చెప్పుచున్నాను** గ్రీకు పదజాలము (*hebdomēkontakis hepta*) అనేక బైబిల్ అనువాదములలో "డెబ్బది ఏళ్ళ

మారులమట్టుకు" అని అనువదింపబడినది (NIV; NRSV; NCV; CEV; NJB). ఇదే గ్రీకు పదజాలము సెప్టువజింట్ లోని ఆదికాండము 4:24లో అగుపించుచున్నది. ఆ వచనమును NASB ఇలా అనువదించుచున్నది, "కయీను ఏడంతల ప్రతి దండన చేసియున్నట్లయితే, లెమెకు డెబ్బది ఏళ్ల మారులమట్టుకు చేయును." లెమెకు ప్రకటన ప్రతిదండన గూర్చిన సూత్రమై. యున్నట్లయితే, యేసు ప్రకటన క్షమాపణా సూత్రమై యున్నది.

ఆయన శిష్యులు ఒక సహోదరుని పరిమితిలేనన్ని పర్యాయములు క్షమించవలెనని యేసు నిశ్చయముగా భావించియున్నాడు. "ఏడు" అను సంఖ్య హెబ్రీ సాహిత్యములోని పరిపూర్ణమైన లేక సంపూర్ణమైన సంఖ్యలలో ఒకటై యున్నది. "ఏడు," లేదా దాని గుణకము చొప్పున ఏదైనా, అది సంపూర్ణ మొత్తమును సూచించుచున్నది. కాబట్టి, యేసు "డెబ్బది ఏళ్ల మారుల మట్టుకు క్షమించండి, దానిని మించి వద్దని" చెప్పలేదు; వాస్తవంగా, ఈ సంఖ్య "అవసరమైనన్ని సార్లు అది ఎన్నిసార్లైనా కావచ్చును" అని సూచించుచున్నది (లూకా 17:3, 4 చూడు).

**వచనము 23.** క్షమాపణ అడుగువారి యెడల వర్తింపజేయవలసిన అపారమైన క్షమాపణా సూత్రమును నియమించిన తదుపరి యేసు, క్షమించిన దాసుని ఉపమానము చెప్పాడు (18:23-34). వారు వచ్చి వారి **లెక్కలు చూచుకొని చెల్లించాల్సిన మొత్తములు చెల్లింపవలెనని** తన **దాసులను** పిలిలించిన **ఒక రాజుతో** ఈ ఉపమానము మొదలగుచున్నది.

**వచనము 24**. ఆ రాజు తన కార్యభారమును నిర్వహించుటకు మొదలుపెట్టినప్పుడు, **అతనికి పదివేల తలాంతులు రుణపడి యుండిన ఒక దాసుడు** అతని యెదుటికి తేబడెను. ఒక "తలాంతు" (*talanton*) బరువులకు సంబంధించిన అతి పెద్ద ప్రమాణాంకమై యుండినది, మరియు దాదాపు డెబ్బది ఐదు పౌండ్లకు సమానమై యుండినది. ఒక తలాంతు మూడు వేల షెకెలుకు సమానమని నిర్గమకాండము 38:25, 26 ఆధారంగా ఊహించుకొనబడుచున్నది.[28] ఆ దాసుడు రుణపడి యుండినది బంగారము, వెండి, లేదా రాగి రూపములో రుణపడియుండినాడో లేదో మత్తయి మనకు తెలియజెప్పుట లేదు. అట్లయినప్పటికిని, ఆ దాసుడు రుణపడి యుండిన భారీ మొత్తమునుబట్టి–బహుశా, "కోట్లాది డాలర్లు"[29]–అతని పరిస్థితి ఎంత నిరాశాపూరితమైనదై యుండినదో అర్థమగుచున్నది. అతడు రుణపడి యుండిన మొత్తము అర్కెలాయు చేత (యూదయ, ఇదూమయ, మరియు సమరయలో), అంతిపయ చేత (గలిలయ మరియు పెరియలో), మరియు రెండవ ఫిలిప్పు చేత (త్రకోనీతి, ఇతూరయ, మొ॥ ప్రదేశములలో) సేకరింపబడిన వార్షిక కప్పము తొమ్మిది వందల తలాంతుల కంటె ఎంతో అధికమై యుండినది.[30]

**వచనము 25.** "అప్పు తీర్చుటకు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*apodidōmi*) తిరిగి **చెల్లించుటకు** అని కూడ అనువదింపబడి, ఈ ఉపమానములో అనేక పర్యాయములు పునఃరావృతమగుచున్నది (18:25, 26, 28, 29, 30, 34). అడోల్ఫ్ డెయిస్మన్ ఇలా చెప్పుచున్నాడు, "నేను తిరిగి చెల్లింతును" అను మాటలు ప్రాచీన ప్రపంచంలో రుణములు తీసికొనువారి చేతిరాత నోట్స్‌లో తరుచుగా అగుపించు కొత్తదనమేమియులేని సూత్రమై యుండినది.[31] అతడు తీసుకొనిన రుణ మొత్తమును తిరిగి చెల్లించుటకు చాలినంత మొత్తము **ఆ దాసుని యొద్ద ఎన్నటికిని ఉండదు గనుక, వాడును వారి భార్య మరియు**

**పిల్లలు మరియు అతడు కలిగియున్న సమస్తము సహితము అమ్మివేయబడవలెనని అతని యజమానుడు ఉత్తరువులు జారీచేసాడు** (నిర్గమకాండము 22:3; 2 రాజులు 4:1; నెహెమ్యా 5:4, 5 చూడు).[32] ఇలా చేయడం ద్వారా, ఆ రాజు తనకు రావలసిన మొత్తములో కనీసము కొంత చిన్న మొత్తమునైనా రాబట్టుకొనగలడు.

**వచనము 26. ఆ దాసుడు రాజు యెదుట సాగిలపడ్డాడు**, ఇది వినయము మరియు మారుమనస్సును సూచించు భంగిమయై యున్నది. రాజు అతని యెడల **ఓర్చుకొనవలెననియు**, అతడు అచ్చియున్న అప్పు **తీర్చుటకు** యింకా కొంత సమయమీయవలెననియు రాజును బహుగా బతిమలాడాడు. ఇతని వాగ్దానము వక్రోక్తియై యున్నది, ఏలయనగా అతడు ఇంత పెద్ద మొత్తము చెల్లించుట అతనికి ఎప్పటికైనను సాధ్యము కాదు.

**వచనము 27.** ఆ దాసుడు తన ప్రాణానికైనా తెగించి చేసిన మొరకు ఫలితంగా, ఆ రాజు అతని యెడల **కనికరపడ్డాడు**. మత్తయి వ్రాసిన సువార్తలో, యేసు తానే ప్రజల దయనీయమైన స్థితిని చూచి తరచుగా వారి యెడల కనికరముతో కూడిన చర్యలు కనుపర్చినట్లు వర్ణింపబడి యున్నాడు (9:36; 14:14; 15:32; 20:34). ఆ రాజు **వానిని విడిచిపెట్టి, వాని అప్పు క్షమించెను**. ఈ చర్య కేవలము కృపతో కూడినదై యుండినది. గనుక ఆ దాసుడు ఎంత గొప్ప ఉపశమనము పొందియుండునో, ఒకరు ఊహించుకొనవలసినదే!

**వచనము 28.** ఈ విధముగా రుణము క్షమింపబడిన దాసుడు వాని యజమానుని ఇంటి నుండి బయటకు వెళ్లిన వెంటనే వాడు **అతనికి వంద దేనారములు అచ్చియుండిన** మరొక దాసుని **కనుగొన్నాడు**. దేనారము, కాయకష్టము చేసికొను కూలివాని కియ్యబడు ఒక దినము కూలి మొత్తమునకు సమానమై యుండిన రోమా ప్రభుత్వ వెండి నాణెమై యుండెను (20:2). కాబట్టి, నూరు దేనారములు అంటే, నూరు దినముల (దాదాపు నాలుగు నెలలు) జీతమగును. ఈ నూరు దినముల కూలిగా లభించు జీతము చెప్పుకోదగ్గ మొత్తమే; కానీ ఈ దాసుడు ఆ రాజుకు అచ్చియుండిన మొత్తముతో పోల్చినట్లయితే, అది ఎంతో కొద్ది మొత్తమే.[33]

మొదటి దాసుడు ఎంత ఆగ్రహం చెందాడంటే తన తోటి దాసుని పట్టుకొని, వాని గొంతు నులుముచు, వాడు అచ్చియుండిన మొత్తమును వెంటనే చెల్లించవలెనని బెదిరించుచుండెను. ఎలాగైనా సరే తనకు రావలసిన మొత్తమును రాబట్టుకొనవలెనని ప్రయత్నించుచుండిన పరిస్థితయ్యింది, కానీ రెండవ దాసుని యొద్ద తిరిగి చెల్లించుటకు ఏమియు లేకుండెను.[34]

**వచనము 29.** మొదటి రుణస్థుడు రాజు యెదుట చేసినట్లే (18:26), రెండవ దాసుడు కూడ తన తోటి దాసుడు తన యెడల **ఓర్చుకొనవలెననియు, తిరిగి చెల్లించుటకు** యింకా కొంత సమయము నీయవలెననియు **వేడుకొనుటకు మొదలుపెట్టాడు**. ఈ సందర్భములో, తిరిగి చెల్లింపబడుటకు ఈ రెండవ దాసుడు అచ్చియుండిన మొత్తము ఎక్కువ వీలుగా ఉండినది.

**వచనము 30.** మొదటి దాసుడు తన తోటి దాసుని యెడల కనికరము చూపలేదు, సరికదా అతడు తిరిగి చెల్లించునంత వరకు వానిని **చెరసాలలో** వేయించాడు (5:25 చూడు). ఇటువంటి సంఘటనలలో, ఖైదు చేయబడినవాడు నిర్బంధ చాకిరి చేయవలసినవాడై యుండెను. వాస్తవముగా, అత్యంత భయంకరమైన పరిస్థితులు అప్పు తీర్చుటను మరింత

కష్టతరము చేసినవి.

**వచనము 31**. ఈ చెడ్డ దాసుడు చేపట్టిన దుర్మార్గపు చేష్టను ఇతర **దాసులలో** కొందరు చూచినప్పుడు, జరిగిన అన్యాయమునకు వారు **మిక్కిలి దుఃఖపడిరి**. తత్ఫలితంగా, వారు ఈ విషయమును వారి యజమానునికి, రాజునకు **తెలియజెప్పారు**.

**వచనము 32**. వివరము తెలిసికొనిన రాజు మొదటి దాసుని **చెడ్డ దాసుడని** సంబోధించి, వాడు అతనిని ఎంతో వినయముతో **బతిమాలుకొన్నందున** వాని యెడల తాను క్షమించిన భారీ మొత్తము గూర్చి వానికి గుర్తుచేసాడు.

**వచనము 33.** రాజు ప్రదర్శించిన **కనికరమునుబట్టి** రుణము క్షమింపబడిన దాసుడు వాస్తవమునకు అదే కనికరమును తన **తోటి దాసుని యెడల** కనుపర్చవలసి యుండెను. అదే విధముగా, దేవుని ప్రేమను మరియు కృపను అనుభవించినవారు తోటి సహోదరులతో వ్యవహరించునప్పుడు వారి యెడల ఈ లక్షణములను ప్రదర్శింపవలెను. "ప్రియులారా, దేవుడు మనలను ఈలాగు ప్రేమింపగా, మనము ఒకనినొకడు ప్రేమింప బద్ధులమై యున్నామని" యోహాను వ్రాయుచున్నాడు (1 యోహాను 4:11).

**వచనము 34.** అందు చేత రాజు **ఈ మొదటి దాసుడు తనకు అచ్చియున్న మొత్తమంతటిని చెల్లించునంత వరకు బాధపరచువారికి వానిని అప్పగించునంతగా వాని యెడల ఆగ్రహము చెందాడు.** రాజు కనుపర్చిన కనికరము (18:27) కోపముగా మారినది ఏలయనగా రుణము క్షమింపబడిన దాసుడు తానే స్వయముగా అనుభవించిన క్షమాపణా విధానాన్ని అనుకరించలేదు. దేవుడు దీర్ఘశాంతముగలవాడైనప్పటికిని (18:26), ఆయన ఓర్పు ఎప్పటికీ నిలిచియుండదు (22:7).

అతడు ఎక్కడైనా డబ్బు దాచుకొన్నాడేమో వెల్లడిచేయుచున్నట్లు "బాధపరచువారు" లేక "చెరసాల అధికారులు" (NIV) చెడ్డ దాసుని ప్రశ్నల ద్వారా పరీక్షించుదురని సూచింపబడినది.[35] రుణస్థులు వారి రుణ మొత్తమంతయు చెల్లించువరకు చెరసాలలో వారు చేయవలసి యుండిన వెట్టి చాకిరిని సహనముతో భరించవలసినవారై యుండిరి. ఈ దాసుడైతే ఎన్నటికైనను వాని రుణమును చెల్లించలేడు గనుక వాని శేష జీవిత కాలమంతా వాడు చెరసాలలోనే శ్రమనొందవలసి యుండును.

**వచనము 35**. యేసు తాను చెప్పుచుండిన ఉపమానమును ఒక అన్వయింపుతో ముగించాడు: **మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయుననెను.** ఉపమానములో, రాజు, తండ్రియైన దేవునికి ప్రతినిధిగా ఉంటున్నాడు. క్షమించని దాసుడు, దేవుని క్షమాపణను అనుభవించి కూడ వారికి విరోధముగా అపరాధము చేసిన ఇతర విశ్వాసులను క్షమించని యేసు శిష్యులకు సంకేతముగా ఉంటున్నాడు. మొదటి దాసుడు చెల్లింపవలసి యుండిన భారీ మొత్తము, ప్రతి క్రైస్తవున్ని దేవుని క్షమించిన చెప్పశక్యముకాని పాపములను సూచించుచుండగా, రెండవ దాసుడు అచ్చియుండిన చిన్న రుణ మొత్తము, ఒక విశ్వాసికి విరోధముగా తన సహోదరుల చేత చేయబడియుండవచ్చునని భావింపబడు కొన్ని పాపములను ప్రస్తావించుచున్నది. ఒకడు తన తోటి విశ్వాసులను క్షమించుట ఇష్టపడకుండ, వానిని క్షమించుటకు దేవుడు ఇష్టపడకుండుటకు హేతువగును (6:15; ఎఫెసీయులకు 4:32; యాకోబు 2:13).

## రాజ్యములో గొప్పతనము (18:1-4)

వినయము మరియు సేవ మాత్రమే ఒకడు గొప్పతనమునకు చేరుకొనగల సుగమమైన మార్గములో తెరువబడియున్న ద్వారములై యున్నవని యేసు బోధించాడు. క్రైస్తవులు అహంకారము మరియు నిరంకుశ ఆధిపత్యముతో కూడిన ప్రాపంచిక మనస్తత్వమును నిలుకడగా నిరాకరించుచుండవలెను (20:25; 1 పేతురు 5:3; 3 యోహాను 9, 10). గొప్పతనము, మనము వెళ్లుచుండు మార్గములో మనకు అడ్డు వచ్చుచున్నారని అనుకొనువారందరిని అణగద్రొక్కుటకు వారిపై అడుగులువేస్తూ మన లక్ష్యసాధన యను నిచ్చెనపై ఎక్కుచు పైకెగబాకుట గూర్చినది కాదు. విశేషంగా, గొప్పతనము వినయపూర్వకమైన సేవ వలన-ఇతరుల జీవితములకు ఆశీర్వాదమై యుండుట వలన-కలుగును (20:26-28; యోహాను 13:1-17).

డేవిడ్ స్టూవర్ట్

## ప్రభువు గొఱ్ఱెల గూర్చి శ్రద్ధవహించుట (18:10-35)

యేసు తన శిష్యులకు బోధించుచు, ఈ రోజుల్లో ఆయనను వెంబడించు చున్నవారు అన్వయించుకొనవలసిన ప్రాముఖ్యమైన పాఠములను ఆయన వారికి నేర్పించాడు (18:10-35).

*క్రైస్తవులు చిన్నవారి గూర్చి తగు శ్రద్ధ వహించవలెను* (18:10-14). ఇతరులకు మన కంటె తక్కువై యున్నవారి వలె మనము ఎంచకూడదు. దేవుడు వారిని కూడ ప్రేమించుచున్నాడు, దేవదూతలు వారికి కాపలా కాయుచుందురు (18:10; హెబ్రీ 1:14 చూడు), మరియు యేసు వారిని రక్షించుటకు వచ్చాడు (18:11). దేవునికి ప్రతి ఒక్కరు ముఖ్యమే (18:12-14).

*క్రైస్తవులు, పాపము చేసి కూడ మారుమనస్సు నొందని వారిని సరైన క్రమశిక్షణలో పెట్టునట్లు తగు శ్రద్ధ వహించవలెను* (18:15-20). పౌలు కొరింథీ సంఘమునకు ఆదేశములిచ్చిన విధంగా, సంఘము తనను తాను పవిత్రముగా కాపాడుకొనవలసిన బాధ్యత కలిగియున్నది (1 కొరింథీయులకు 5:4-11). పాపము బాహాటముగా దాని ఉనికి కలిగియున్నట్లు అనుమతింపబడినట్లయితే, క్రీస్తు హేతువునకు అవమానము కలుగును. ఒక పాపిని మరలా దేవుని యొద్దకు మళ్లించుట కొరకే క్రమశిక్షణ ఉద్దేశింపబడినది.

*క్రైస్తవులు క్షమించుటకు తగు శ్రద్ధ వహించవలెను* (18:21-35). పేతురడిగిన ప్రశ్నను, ప్రభువిచ్చిన సమాధానమును, మరియు క్షమాపణా ఉపమానమును మనము జాగ్రత్తగా పరిశీలించుదము.

## కాపాడి సంరక్షించు దేవదూతలు (18:10)

మత్తయి 18:10లో, "ఈ చిన్నవారిలో ఒకనినైనను తృణీకరింపకుండ చూచుకొనుడి," ఏలయనగా "వీరి దూతలు పరలోకమందున్న నా తండ్రి సముఖమున ఎల్లప్పుడు

పరలోకమందు చూచుచుందురని" యేసు పలికాడు. వీరి దూతలు" అను పదజాలము "కాపాడి సంరక్షించు దేవదూతల" గూర్చి ప్రస్తావనయై యున్నదని కొందరి చేత అనువదింపబడినది. పరిశుద్ధ బైబిల్ ఈ పదజాలమును ఉపయోగించదు, కానీ అస్పష్టముగా నున్న ఇతర వాక్యభాగములు, వారున్నారను అభిప్రాయముద్రవేయవచ్చును (ఆదికాండము 48:16; కీర్తనలు 34:7; 91:11, 12; దానియేలు 4:13; 10:13 21; 12:1; అపొస్తలుల కార్యములు 12:13-15). అంతమాత్రమేగాక, అసంఖ్యాకమైన బైబిలేతర మూలధారములు ఈ అభిప్రాయమునకు తోడ్పడుచున్నవి.[36]

ఇటువంటి ప్రత్యేక దేవదూతల గూర్చిన ఆధునిక నమ్మకములలో అధిక శాతము మనిషి మనస్సులో ఉత్పన్నమౌతుందే కానీ అది దేవుని వాక్యము వలన కలుగదు. ప్రతి మానవుడు పుట్టక మునుపే లేదా పుట్టిన సమయంలో వాని ఆత్మను కాపాడి సంరక్షించుటకు ఒక దేవదూత నియమింపబడి యున్నారని కొందరు నమ్ముదురు. క్రైస్తవులకు మాత్రమే ఈ కాపుదల కలదనియు, ఆ విశ్వాసి దేవుని యెడల విశ్వసనీయమైనవాడుగా నిలిచియున్నంత వరకు మాత్రమే ఈ కాపుదల వానిపై నిలిచి యుండుననియు ఇతరులు నమ్ముదురు. విశ్వాసికి హాని కలుగకుండా లేదా వాడు అపాయమునకు గురికాకుండా కాపాడుటయే, సంరక్షించు దేవదూత నియామకము చేయబడుటలో గల ఉద్దేశమై యున్నదని ఒక సిద్ధాంతము భావించుచున్నది. ఈ పాత్ర వహించు దేవదూత, విశ్వాసి క్షేమకరమైన మార్గములలో వెళ్లునట్లును, అపాయము నుండి తప్పింపబడునట్లును అతనికి మార్గనిర్దేశనము నిచ్చుచుండును. కాపాడి సంరక్షించు దేవదూతలు మనిషిలో నన్ను మనస్సాక్షి వహించు పాత్ర వహించుచుందురనునది మరొక సిద్దాంతమై యున్నది. ఒకని కుడి ప్రక్క భుజముపై ఒక మంచి దూత, ఎడమ ప్రక్క భుజముపై చెడ్డ దూత ఉండును, వాడు వ్యతిరేక దిశలలో వెళ్లుటకు వానికి మార్గనిర్దేశనము నిచ్చుటకు ప్రయత్నించుచున్నట్లు చిత్రింపబడిన పటములను మనలో అధిక సంఖ్యాకులము చూచియుందుము.[37]

క్రైస్తవులందరిని కాపాడుటకు ఒక్కొక్కరికి ఒక సంరక్షించు దూత ఉన్నట్లయితే, మనలో దురదృష్టకరమైన సంఘటనలు సంభవించినప్పుడు తప్పెవరిది? కాపాడి సంరక్షించు దూత కాపాడలేకపోయాడా? లేక, ఆ క్రైస్తవునికి ఒక తప్పుడు దూత లేదా నిర్లక్ష్యమును ప్రదర్శించు దూత నియమింపబడియుండెనా? వ్యక్తిగతముగా సంరక్షణనిచ్చు దూత గూర్చిన అభిప్రాయము కొందరు విశ్వాసులకు ఆదరణ కలిగించవచ్చును, కానీ సంబంధిత నిదర్శనము లేఖనములలో కొరతగా నున్నది. అయితే ఈ రోజుల్లో సహితము దూతలు వారి వారి పనులు నిర్వర్తిస్తున్నారని పరిశుద్ధ బైబిల్ మనకు బోధించుచున్నది, కానీ వ్యక్తిగతముగా సంరక్షణనిచ్చు దూతలుగా ఉండాల్సిన అవసరం లేదు దేవుడనుగ్రహించు దైవీకమైన సమకూర్పులను సమకూర్చు పరిచారకులుగా వారు పనిచేయుచుందురు (హెబ్రీయులకు 1:14) ఒకరు దూతల విషయములోనే నిమగ్నమై యుండనవసరములేదు, సరికదా వారిని ఆరాధించాల్సిన అవసరం అంతకన్నా లేదు (కొలొస్సయులకు 2:18; ప్రకటన 22:8, 9), ఏలయనగా, వారు కూడ, సృజింపబడినవారే (కీర్తన 148:1-6). మన దృష్టి అంతా క్రీస్తుపై కేంద్రీకరింపబడి యుండవలెను (హెబ్రీయులకు 1:5, 6).

## సంఘర్షణను సరిదిద్దుకొనుట (18:15-20)

పై వాక్యభాగములో ఇతరుల మనస్సులను గాయపర్చనను మారుమనస్సు నొందనొల్లని క్రైస్తవులతో ఎలా వ్యవహరించాలో చూపించుచున్న ఒక సూత్రమున్నది, అయితే ఈ వాక్యభాగమునకు వాస్తవముగా దానికి వర్తించని విశాలమైన అర్థవివరణలు తరుచుగా ఇవ్వబడుచున్నవి. ఈ వాక్యభాగము నిర్దిష్టముగా ఒక విశ్వాసి మరొక విశ్వాసి యెడల చేసిన వ్యక్తిగత అపరాధములకు సంబంధించినదై యున్నది. ఈ సందర్భములో, ఈ ఇరువురు ఏకాంతముగా కలిసికొనినప్పుడు చేయబడిన తప్పిదము విషయమై మారుమనస్సు కలుగునప్పుడు, ఆ విషయము బాహాటముగా సంఘమంతటికిని తెలియజెప్పబడవలెను. తద్వారా తప్పిదము చేసిన వ్యక్తి మారుమనస్సు నొంది ప్రభువు యొద్దకు మళ్లునను ఆశతో మాత్రమే ఈ చర్య చేపట్టబడును.

## దేవుని క్షమాపణ మరియు మన క్షమాపణకు గల తారతమ్యములు (18:21-35)

మత్తయి 18:21-35, క్షమించుటలో గల ఆశీర్వాదముల గూర్చి యేసు బోధించిన ఒక చోటై యున్నది. విశ్వాసుల మధ్య ఏర్పడుచుండు భేదాభిప్రాయములతో ఎలా వ్యవహరించాలో ఆయన వివరిస్తూ, ఒక ఉపమానము ద్వారా క్షమాపణ గూర్చి బోధించాడు.

*క్షమించుటకు దేవునికి గల సిద్ధమనస్సు.* ఈ ఉపమానములో మొదటి దాసుని అప్పు వాడు తిరిగి చెల్లించలేకుండినంతటి భారీ మొత్తమై యుండెను. వాని యజమాని, దేవునికి ప్రతినిధిగా ఉన్నవాడు, వాని అప్పునంతటిని క్షమించాడు. దేవుని క్షమాపణకును మన క్షమాపణకును గల తారతమ్యమును యేసు చూపించుచుండెను. క్షమింపబడిన దాసుడు, వాడు అచ్చియుండిన మొత్తముతో పోల్చినట్లయితే ఎంతో అత్యల్పమైన మొత్తము అచ్చియుండిన మరొక దాసుని క్షమించుటకు నిరాకరించుచుండెను. ఈ విషయము వాని యజమాని దృష్టికి తేబడినప్పుడు, వాడు పిలిపించబడి, లెక్క అంతయు చెలింపవలెననియు, చెల్లించునంత వరకు రుణస్థుల చెరసాలలో వేయబడి బాధల ననుభవింపవలెననియు ఏర్పాటు చేయబడినది (18:34).

*ప్రతి పాపమును క్షమించుటకు దేవుడు ఇష్టపడుచున్నాడు.* క్రైస్తవులందరును దేవుని చేత క్షమింపబడిన పాపులై యున్నారు. సిలువ సందేశము, మనము దేవునికి అచ్చియుండియు ఎన్నడును తిరిగి చెల్లింపలేకపోయిన బ్రహ్మాండమైన పాప రుణము గూర్చినదై యున్నది. ఆయన కుమారుని మరణము ద్వారా, మనము అచ్చియుండిన మన పాపముల రుణ మొత్తమంతటిని దేవుడు చెల్లించాడు.

*దేవుడు మన పాపములను సంపూర్తిగా క్షమించుటకు ఇష్టపడుచున్నాడు.* దేవుని సంపూర్ణమైనది, మరియు దైవీకమునైన క్షమాపణను గ్రహించగలుగుటకు అనేక లేఖన భాగములు మనకు సహాయకరముగా నుండును (కీర్తనలు 103:12; 130:7; రోమీయులకు 4:7, 8; హెబ్రీయులకు 8:12; 10:17). అక్షరాలా దేవుడు మర్చిపోడు, సరికదా మర్చిపోజాలడు-కానీ వాని పాపము గూర్చి పశ్చాత్తాపపడు పాపిని పాపము వలన వచ్చు న్యాయసమ్మతమైన శిక్ష నుండి ఆయన స్వచ్ఛందముగా విడుదల చేయును.

*మనము ఇతరులను క్షమించినట్లయితే దేవుడు మనలను క్షమించుటకు ఇష్టపడుచున్నాడు.*

దేవుడు మనలను క్షమించుట మనము ఇతరులను క్షమించుటపై ఆధారపడి యున్నది (5:7; 6:14, 15; 18:21, 22; లూకా 17:3, 4). మనము క్షమింపబడి యున్నాము గనుక మనము కూడ క్షమింపవలెనని పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీయులకు 4:32). మనము ఇతరులకు అందజేయునట్లు క్షమాపణ దేవుడు మనకనుగ్రహించిన ఆయన వరమై యున్నది.

మన యెడల చేయబడిన తప్పిదమును మనము పూర్తిగా "మర్చిపోతేనే" తప్ప మన మనస్సును గాయపర్చిన వ్యక్తిని మనము క్షమించలేదని తలంచుట మనము మానివేయవలెను. క్షమించుట అనగా, ఒక రుణమును కొట్టివేయుటయే. ఒకడు చేసిన తప్పిదము నుండి వానిని విడుదలచేయుట ద్వారా, వానిని క్షమించుటకు లేదా ఇరువురి మధ్య సవరింపు చేసుకొనుటకు మనము నిరాకరించుదుము (రోమీయులకు 12:17, 21). ప్రతీకారము తీర్చుకొనవలెనను తలంపులు, కొన్ని పర్యాయములు జరుగుచున్నట్లుగా, మన మనస్సులోకి ప్రాకినట్లయితే, వాటిని మనము మన అంతరంగములో నుండి అవతలకి త్రోసివేయవచ్చును, మన యెడల తప్పిదము చేయబడినదని మనము గుర్తుచేసికొన్నప్పుడు, పగ తీర్చుకొను ప్రయత్నమును మనము నిగ్రహించుకొనగలుగుట క్షమాపణలో గల ఆశీర్వాదమై యున్నది.

"తండ్రీ, ... వీరిని క్షమించుమని" యేసు సిలువ మీద నున్నప్పుడు ప్రార్థించాడు (లూకా 23:34). ఆ ప్రార్థనకు ప్రత్యుత్తరము పెంతెకొస్తు దినాన లభించినది, అప్పుడు- సువర్తమానము వినినప్పుడు-అనేకులు మారుమనస్సు నొంది వారి పాప క్షమాపణ కొరకైన బాప్తిస్మము పొందారు (అపొస్తలుల కార్యములు 2:23, 36-41).

నీవును క్షమింపబడితివా? నీవును క్షమించుచున్నావా?

## నన్ను క్షమించుము (18:21-35)

మనకు ప్రభువైన యేసు క్రీస్తు ఎప్పుడైనా ఉపదేశించిన అత్యంత గొప్ప పాఠములలో కొన్ని 18వ అధ్యాయంలో కలవు. ఆయన క్షమాపణ గూర్చి-క్షమాపణ అనగా ఏమిటి మరియు అది మనకు ఏమి చేయునో యని-మాటలాడాడు.

క్షమాపణ. మన సొంత మానసిక, భావోద్రేక, మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యము నిమిత్తము అత్యావశ్యకమై యున్న ఒక విమోచనా చర్యయై యున్నది. క్షమాపణ లేమి అనేక మంది క్రైస్తవులలో ప్రబలముగా ప్రబలియున్న ఒక పాపమై యున్నది. "నేను నిన్ను క్షమించుచున్నాను" అని చెప్పడంతో సరిపోదు; సరికదా, మన యెడల తప్పిదము చేసినవానితో సభ్యతతో ప్రవర్తించుట కూడా చాలదు. యథార్థమైన క్షమాపణ అనగా, మనస్సును కలిగిన గాయమును అధిగమించి అవతలి వ్యక్తితో సమాధానపడుటయై యున్నది. ఇవ్విధముగా చేయుటకు విఫలమగుట వలన అది ఎన్నటికినీ నయముకాని బహిరంగమైన గాయముగానే మిగిలియుంటుంది.

క్షమాపణ, దేవుని కృపకు అత్యంత శక్తివంతమైన సాక్ష్యమై యున్నది. మనము ఇతరులను క్షమించినప్పుడు, దేవుడు నేటికిని సజీవుడై మరియు కార్యశీలుడై యున్నాడని అది ప్రపంచమునకు చాటిచెప్పును. ఇతరులు మన యెడల చేసిన అపరాధముల వలన మనకు అవమానము కలిగినదని మనము ఆగ్రహము తెచ్చుకొను మన అనుభూతులకు

అదొక శక్తివంతమైన విరుగుడై యున్నది. ఏదైన ఒక ద్రోహమును పెంచిపోషించుచుండుట కొందరికి గంభీరమైన ఒక ఆధ్యాత్మిక సమస్యయై యున్నది. ఇతరులతో సువర్తమానమును పంచుకొనవలెను స్థిరసంకల్పమును అది బలహీనపర్చును. కార్యసార్ధకమైన పరిచర్యను అది నిరోధించును. "నా బ్రతుకులో నేను వారిని గుర్తుచేసికొనను" అని అనుకొంటూ మనము ఇతరులను మన జీవితములకు దూరము చేసికొనుటకు బదులుగా మనము వారిని క్షమింపవలెను.

క్షమాపణ, గాయపడిన మన మనస్సులు బాగుపడి, మన జీవితములు ఆరోగ్యవంతమైనవై యుండుటకు అగత్యమై యున్న ఒక అనుభవమై యున్నది. క్షమాపణ అనగా కేవలము ఉదాసీనతతో సహిస్తూ ఊరకుండుట కాదు. "ఇంతకు మించి నేను చేయగలిగినదేమియు లేదని" చెప్పుచుండు వైఖరి వలన స్వస్థత కలుగదు. మనము బలహీనతలను తొలగించుకొని బలపడుటకును, అయోగ్యతను విసర్జించి ఆత్మనిర్ణయమును అవలంబించునట్లు క్షమాపణ మనలను అనుమతించును.

క్షమాపణ అంత వరకు అంధకారమయమై యుండిన లోకమును అత్యంత ఉజ్వలము గావించు ఒక సృజనాత్మకమైన శక్తియై యున్నది. నీవు క్షమించవలసినవారు యింకా ఎవరైనా ఉన్నారా? నీ అహంభావమును మరియు బాధను అణగద్రొక్కుకొని, సరైన పని సత్వరమే చేయుము.

నీవు దేవుని క్షమాపణను అంగీకరించావా?

## సంపూర్ణ క్షమాపణ (18:23-35)

ఈ ఉపమానము దేవుడు మన యెడల ప్రదర్శించుచున్న క్షమాపణను గూర్చినదై యున్నది. దేవుని కృపాకనికరముల చేత క్షమింపబడి రక్షింపబడిన క్రైస్తవులందరును పాపులై యున్నారు. క్షమాపణ దేవుని మనస్సులో కలుగును. "మన పాపములను క్షమించు దేవుడు, వాటిని మర్చిపోతాడు కూడ" అని మనము కొన్ని పర్యాయములు చెప్పుకొనుచుందుము (హెబ్రీయులకు 8:12; 10:17 చూడు). వాస్తవమునకు దేవుడు మన పాపములను మర్చిపోడు. ఎంతైనా, ఆయన సర్వజ్ఞానియై యున్నాడు కదా; ఆయన సమస్తమును ఎరుగును. అనగా, మన పాపముల మూలమున ఆయన చేత మనకు విరోధముగా మోపబడిన న్యాయసమ్మతమైన విషయాల నుండి ఆయన మనలను స్వచ్ఛందముగా విడిపించునని దీని అర్థము. మన పాపములనుబట్టి మనము ఆయనకు ఋణపడియున్న ఋణమును ఆయన ఎన్నడును మన యొద్ద తీసికొనడు. మనము పొందవలసిన మరణ శిక్ష నుండి ఆయన మనలను విడిపించును.

సిలువ సందేశము, మనము దేవునికి అచ్చియున్న బ్రహ్మాండమైన ఋణము-మనము ఎన్నటికినీ తీర్చలేని ఋణము-గూర్చినదై యున్నది. దేవుడు హింసాత్మక సాధనమును, సిలువను, ఆయన అనుగ్రహించు ఆశీర్వాదమునకు ఒక మార్గముగా మార్చాడు. దేవుడు క్షమించినప్పుడు, ఆయన సంపూర్తిగా క్షమిస్తాడు. గనుకనే క్రైస్తవులు ఇతరుల యెడల ఆయన క్షమాపణను ప్రదర్శించుచు, ఆయనను అనుకరించుటకు వారు పిలువబడి యున్నారు.

సూచనలు

[1]ఈ ప్రధాన విషయాలు విల్యమ్ బార్క్లే చేత జాబితాగా ఇవ్వబడిన లక్షణముల నుండి అనుకూలించుకొనబడినవి, *The Gospel of Matthew*, vol. 2, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 190-92. [2]మత్తయి 5:1; 13:10, 36; 14:15; 15:12, 23; 17:19; 24:1, 3; 26:17 చూడు. [3]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 447. [4]ఏదిఏమైనా, ఆధ్యాత్మిక అపరిణతను సూచించుటకు క్రొత్త నిబంధనలో బాల్యము అను పదము కొన్ని పర్యాయములు వ్యతిరేకార్థముగా ప్రయోగింపబడుచున్నది (11:16, 17; 1 కొరింథీయులకు 13:11; 14:20; ఎఫెసీయులకు 4:14; హెబ్రీయులకు 5:13, 14). [5]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 156. [6]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 461. [7]మత్తయి 5:29, 30; 11:6; 13:21, 57; 15:12; 16:23; 17:27; 18:6, 8, 9; 24:10; 26:31, 33. [8]*1 Clement* 46.8. [9]గలిలయులు, హేరోదు పక్షమునకు చెందినవారిని తీసికొని వెళ్లి వారిని సముద్రములో ముంచివేసి తిరుగబడ్డారని జోసెఫస్ నివేధించాడు. (Josephus *Antiquities* 14.15.10.) ఔగుస్తు కొందరి మెడలకు బరువులను కట్టి వారిని నదిలోనికి పారవేసాడని స్యూటోనియస్ చెప్పుచున్నాడు. (Suetonius *Lives of the Caesars: Augustus* 2.67.) [10]అదనపు సమాచారము కొరకు, పదములతో పాటుగా, Carl G. Rasmussen, "Mill; Millstone," in *The lnternational Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:355-56 చూడు.

[11]Jack P Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 56. హెబ్రీ బాషలో, ఉదాహరణ వాక్యములుగా ఎత్తి చూపింపబడిన గ్రంథభాగములు అన్నియును రాజు యొక్క "ముఖము" అని పేర్కొనుచున్నవి. [12]Morris, 465. [13]Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament*, 2d ed. (Stuttgart: German Bible Society, 1994), 36. [14]Mishnah *Peah* 4.2; Jerusalem Talmud *Shabbath* 14.3. [15]Keener, 452. [16]Lewis, 57. [17]Metzger, 36. [18]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 697-98. [19]H. L. Mansel, *The Bible Commentary*, vol. 7, *Matthew to Luke* (Grand Rapids, Mich.: Baker Book House, 1981), 95. [20]మత్తయి వ్రాసిన సువార్తలో దీనికి ముందు, సమాధానపడవలసిన బాధ్యత తప్పిదము చేసినవానిపై మోపబడినది (5:23, 24పై గల వ్యాఖ్యనము చూడు).

[21]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 275. [22]*Community Rule* 5.24-6.1; *Damascus Rul*e 9.2-4. [23]Mishnah *Makkoth* 3.1, 2. [24]Keener, 454. [25]Josephus *Wars* 1.5.2. [26]Talmud *Berakoth* 6a; Mishnah *Aboth* 3.2, 3 చూడు. [27]Talmud *Yoma* 86b. [28]Coy D. Roper, *Exodus*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2008), 612 చూడు. [29]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 538. [30]Josephus *Antiquities* 17.11.4. అంతకు పూర్వపు కాలములో పాలస్తీనా సుంకము మొత్తమును కర్షకులు ఎనిమిది వేల తలాంతులను వేలం పాడినట్లు జోసెఫస్ పేర్కొన్నాడు. (12.4.4 చూడు.)

[31]Adolf Deissmann, *Light from the Ancient East*, rev. ed., trans. Lionel R. M. Strachan (Grand Rapids, Mich.: Baker Book House, 1978), 331. [32]Livy 26.34.3. [33]Morris, 475. [34]అదేవిధముగా, అప్పు అచ్చియున్నవానిని సంత వీధిలో గొంతుతో చేతపట్టుకొన్న సంఘటన మిష్నా కంటికెదురుగా జరుగుచున్నట్లు ఊహించుచున్నది. (Mishnah *Baba Bathra* 10.8.) [35]Lewis, 62. [36]Tobit 5:21, 22; 12:11-22; *1 Enoch* 100.5; *Jubilees* 35.17; *Testament of Levi* 5.6; *Testament of Jacob* 2.5, 6; *Pseudo-Philo* 11.12; 15.5; 59.4; *Genesis Rabbah* 44.3; 60.15; *Song Rabbah* 3.6.3. [37]Origen *Homilies on Luke 12* చూడు.